Ranga Rao

[illegible] రంగారావు

# నీడలోని ఆడది

వసుంధర

బజార్లో రాజశేఖరాన్ని చూడగానే ఆశ్చర్యంకంటె గగుర్పాటు ఎక్కువగా కలిగింది నాకు. అతనుకూడా నన్ను చూసి ఆగాడు. గగుర్పాటుకంటె ఆశ్చర్యం అతని కళ్ళలో ఎక్కువగా వున్నట్లు కనబడుతోంది.

"నువ్వేమీ మారలేదు మోహనా!" అన్నాడతను.

"నువ్వుకూడా!" అన్నాను స్త్రీ సహజమైన సిగ్గుతో తలవంచుకుని.

"ఈరోజు చాలా సుదినం నాకు. నీ దర్శనమైంది."

నేను మరికాస్త సిగ్గుపడుతూ "ఎప్పుడొచ్చావిక్కడికి?" అన్నాను.

"నిన్న వచ్చాను. నీ అడ్రసు వుంది. ఈ వేళ సాయంత్రం వద్దామనుకున్నాను. ఈలోగానే నీ దర్శనమైపోయింది. అలా పార్కులోకి వెళ్ళి మాట్లాడుకుందాం, వస్తావా?" అనడిగాడు రాజశేఖరం. నేను మౌనంగా తలూపి అతన్ని అనుసరించాను.

రాజశేఖరం మా అన్నయ్య స్నేహితుడు. మా ఇంటికి తరచుగా వచ్చి వెడుతూండేవాడు.

నాకు పదహారేళ్ళ వయసప్పుడు అతనితో పరిచయమైంది. ఆడా, మగా, కొత్తా, పాతా అని లేకుండా అందరితో సమానంగా చనువుగా మాట్లాడగల శక్తి, నేర్పు రాజశేఖరానికున్నాయి.

అందువల్ల అతను అన్నయ్యకోసమే వచ్చినా వాళ్ళ సంభాషణల్లో నేనూ పాల్గొంటూ వుండేదాన్ని. అన్నయ్యతో వున్నంత చనువుగానూ అతనితో మసిలేదాన్ని. కానీ అతన్నెప్పుడూ అన్నయ్యగా భావించలేదు. అందుకు కారణం అప్పుడప్పుడు అతను నావంక చూసే చూపులు.

ఎప్పుడైనా మా ఇద్దరికీ కొన్ని క్షణాల ఏకాంతం అభిస్తే చాలు—అతడు నావంక అదోలా చూసేవాడు. ఆ చూపులు నాకు బాగుండేవి.

రాజశేఖరం అందంగా వుంటాడు. ఆకర్షణీయమైన పర్సనాలిటీ! ఊళ్ళో డబ్బున్న వాళ్ళబ్బాయని విన్నాను. నా కన్నె మనసుకు అతనిలో అన్నీ సుగుణాలే కనిపించాయి. నాకు తెలియకుండానే నేను అతనిపట్ల ఆకర్షితురాలినవుతూ అతన్ని ప్రేమిస్తున్నాను. అన్నయ్యకోసం అతను మా ఇంటికి వస్తే నాకు చాలా సంతోషంగా వుండేది. అతడు రానిరోజున నాకు ఏదో వెలితి అనిపించేంది.

ఒకరోజు అనుభవం మాత్రం నేను మరిచిపోలేదు. ఇంట్లో నేను ఒక్కర్తినే వున్నాను. ఎవరో తలుపుతడితే తీశాను. రాజశేఖరం!

"ఇంట్లో ఎవరూ లేరండి!" అన్నాను.

రాజశేఖరం నిరుత్సాహంగా ముఖంపెట్టి—"అయితే

వెళ్ళిపోతాను కానీ నాకు దాహంగా వుంది. కాసిని మంచినీళ్ళు దొరుకుతాయా?'' అనడిగాడు.

"ఎంతమాట? అలా కూర్చోండి—నేను మంచినీళ్ళు తెచ్చి ఇస్తాను'' అంటూ వంటింట్లోకి వెళ్ళాను. నేను మంచినీళ్ళ గ్లాసుతో నడవలోకి వచ్చేసరికి అతను కనబడ లేదు. చుట్టూ చూసి ఓసారి వీధిలోకి వెళ్ళాను. అతను లేడు. వెళ్ళిపోయాడని ఊహించుకుని వీధి తలుపులు వేసే శాను. అలా ఎందుకు చేశాడు చెప్మా అనుకుని గ్లాసు పెట్టడానికి వంటింట్లోకి వెళ్ళాను.

చటుక్కున తలుపు చాటునుంచి రాజశేఖరం బయ టకు వచ్చి నన్ను కౌగలించుకుని బలంగా ముద్దు పెట్టు కున్నాడు.

ఒక్క క్షణంపాటు ఏం జరిగిందీ నాకు తెలియలేదు. తెలిసేసరికి అంతా అయిపోయింది. విసురుగా అతన్ని వదిలించుకున్నాను.

అతను నన్ను వదిలిపెట్టి — "దాహం తీరిపోయింది. చాలా థాంక్స్!'' అన్నాడు.

ఏం మాట్లాడాలో నాకు తెలియలేదు. నన్ను నేను తమాయించుకుని—"మీ రిక్కడే వున్నారా? మీరు వెళ్ళిపోయారనుకుని తలుపులు గడియకూడా వేశాను. ఎవరైనా వస్తే ఏమనుకుంటారు?'' అన్నాను.

"మీరే చెప్పండి!'' అన్నాడు రాజశేఖరం.

నాకు అతనిమీద కోపం రావడంలేదు. కానీ పరిస్థితికి చాలా భయంగా వుంది. అతన్ని అప్పటికప్పుడు అక్క ణ్నుంచి పంపేయకపోతే అతన్ని అదుపుచేయగల శక్తి నాకుండదేమో నన్న భయం కలిగింది. నేనింకా అటువంటి పరిస్థితిలో వుండగానే వీధితలుపులు దబదబా మ్రోగాయి.

నాకు చాలా భయంవేసింది — "ఇప్పుడెల్లా?" అన్నాను.

రాజశేఖరం ఎక్కడా భయపడ్డట్టు కనబడలేదు. అయినా మగాడు. అతనికేం భయం? ఇల్లుకూడా మాది. మా ఇంట్లో నేనొక్కర్తినే వున్నప్పుడు ఓ మగవాడు తోడుండగా ఇంటి తలుపులు లోపల గడవేసి వున్నాయంటే అన్నివిధాలా నేనే దోషినవుతాను.

"వెళ్ళి తలుపు తీయి" అన్నాడు రాజశేఖరం ఆజ్ఞాపిస్తున్నట్లు.

అతని ఏకవచన ప్రయోగం నాకు నచ్చలేదు. "నువ్వే తీయి" అన్నాను.

"నాకు అభ్యంతరంలేదు" అంటూ అతను కదిలాడు.

"ఆగు" అన్నాను. నిజంగా వెళ్ళి తలుపులు తీసేస్తాడేమోనని భయంవేసింది. "నువ్విక్కడే వుండు. మళ్ళీ నేను పిలిచేదాకా కదలకు" అంటూ అక్కణ్ణించి బయల్దేరాను.

తలుపులు తీసేటప్పుడు మా ఇంట్లోని మనుషులెవ్వరూ రాకూడదని దేవుడికి దండం పెట్టుకున్నాను. అమ్మ చుట్టాలింటికి వెళ్ళింది తమ్ముడ్ని వెంటబెట్టుకుని. రాత్రి యెనిమిది దాకా రాకూడదు. నాన్నగారూళ్ళో లేరు. అన్నయ్య ఆఫీసు వదిలినా ఇంటికొచ్చే సమయమిదికాదు.

తలుపులు తీయగానే "ఏంటమ్మా – యింతాలస్యం చేశావ్!" అంటూ లోపల ప్రవేశించాడు అన్నయ్య.

ఏం చేయాలో తోచలేదు నాకు. అన్నయ్యనువారించే ఉపాయం తట్టడంలేదు.

క్షణాలమీద మెదడు పనిచేసింది. అన్నయ్య దగ్గర నాకు చనువెక్కువ. వాడికి జరిగింది చెప్పేయడమే

మంచిదనిపించింది. ముద్దు విషయం మినహాయించి అన్నీ చెప్పేసి, "మిస్టర్ రాజశేఖరం, ఇక యిలా రావచ్చు" అన్నాను.

నా మాటలు అన్నయ్య నమ్ముతాడన్న ఆశ లేక పోయినా అది నిజంకాబట్టి తడబడకుండా అంతా చెప్ప గలిగాను. అబద్ధాలు చెప్పడం ఇంకా లేనిపోని అను మానాలకు దారి తీస్తుందనితోచింది నాకు.

రాజశేఖరం నవ్వుతూ లోపల్నుంచి వచ్చాడు. అతని ముఖంలో ఏ కోశానా భయంలేదు.

"అసాధ్యుడివిరా నువ్వు" అన్నాడు అన్నయ్య.

"నాకీ అవకాశం ఇప్పించిన నిన్ను మెచ్చుకోవాలి" అన్నాడు రాజశేఖరం.

అవకాశం అన్నయ్య ఇప్పించడమేమిటి? నేను అను మానంగా అన్నయ్య వంక చూశాను.

నా కళ్ళలోని ప్రశ్నను చదివినట్లుగా అన్నయ్య ఇలా అన్నాడు. "శాస్త్ర తెలిసిన అమ్మాయైతే అబ్బాయి కోరికమీద ఏకాంతంలో వున్నప్పుడు తలుపులు గడియ వేసి రహస్యం మాట్లాడడానికి సంకోచించదు. ఎటొచ్చీ అందుకు అవలంబించాల్సిన పద్ధతులు కొన్ని వున్నాయి అంటూ వీడు నాతో అంటే పందెం కాశాను. పందెపు టావేశంలో అది మనింట్లోనే అన్నా ఒప్పుకున్నాను. వీడిదగ్గర ఇలాంటి ట్రిక్కులున్నాయని నాకు తెలియదు. బయటినుండి రహస్యంగా గమనిస్తూ వీడ్ని లోపలకు రానిచ్చినందుకు, ఆ తర్వాత తలుపులు వేసినందుకూ నీ గురించి చాలా ఆశ్చర్యపోయాను."

అన్నయ్య చెప్పిందివింటూ రాజశేఖరం చొరవకూ, ధైర్యానికీ నేను ఆశ్చర్యపోయాను. అతను భయపడక

పోవడానికి కారణం అర్థంచేసుకో గలిగాను. అయితే అన్నయ్యిచ్చిన అవకాశాన్నతనెలా ఉపయోగించుకున్నాడో అన్నయ్య ఊహించుకోలేదు.

నవ్వడానికి ప్రయత్నిస్తూ "నీ స్నేహితుడు తెలివైన వాడని ఒప్పుకుంటాను కానీ అన్నయ్యా! ఎంత స్నేహితుడయినా ఇలాంటి పందేలు వేయకూడదు. ఏకాంతాలను దుర్వినియోగం చేసుకునే దుర్మార్గులు చాలామంది ఉంటారు" అన్నాను. నేను దుర్మార్గులు అన్నప్పుడు రాజశేఖరం ముఖం అదోలాగయిపోవడం గమనించాను.

అన్నయ్యమాత్రం "మరొకడితోటి మరొకడితోటి అయితే పందెం ఎందుకు కాస్తానమ్మా! వీడు నా స్నేహితుడు. నా స్నేహితులెలాంటి వారో నీకు వేరే నేను చెప్పాలా?" అన్నాడు గర్వంగా.

'నీ స్నేహితులెలాంటివారో ఇప్పుడే తెలిసిందినాకు' అనుకున్నాను మనసులో.

ఆ తర్వాతనుంచి మా ఇద్దరి మధ్యనూ చనువు పెరిగింది. మళ్ళీ ఎన్నడూ ముద్దుపెట్టుకునేటంత దగ్గరగా రాకపోయినా చాలా చనువుగా మాట్లాడుకుంటూండేవాళ్ళం. అతను నన్ను ప్రేమిస్తున్నాననీ నేను లేకపోతే బ్రతకలేననీ కాస్త ఏకాంతం దొరికినప్పుడల్లా చెబుతూండేవాడు.

అతని మాటలు నాకు చాలా ఆనందాన్ని కలిగించేవి. ఆ ఆనందమే అతనిమీద అభిమానాన్ని పెంచుతుండేది. ఇంట్లో పెద్దలు ఒప్పుకుంటే అతన్ని పెళ్ళి చేసుకునేందుకు నాకు అభ్యంతరం లేదు.

నాకు పెళ్ళి సంబంధాలు చూడడం ఆరంభమయింది. పదిహేడో ఏడు నడుస్తూండగా ఒక సంబంధం స్థిరపడింది. ఆ విషయము తెలిసిన రాజశేఖరం కంగారు పడ్డాడు.

"నన్ను పెళ్ళి చేసుకోవా?" అన్నాడు.

"మా నాన్నగారి నడుగు" అన్నాను.

"పెళ్ళి నీకు—మీ నాన్నగారికి కాదు."

"మా నాన్నగారేసంబంధం చూసినా నా కిష్టమే! నీకిష్టం లేకపోతే నువ్వే వెళ్ళి మా నాన్నగారికి చెప్పుకో వాలి" అన్నాను.

"ఏం చూసి ఇష్టపడుతున్నావ్! వాడికి పదిరెట్లు ఆస్తి ఉంది నాకు. వాడికంటె లక్షరెట్లు యెక్కువ ప్రేమ ఉంది" అన్నాడు రాజశేఖరం.

"ఆస్తి సంగతి నిజమే! ప్రేమసంగతి యింకా తెలి యదు."

"తెలుసుకోవాలనుకుంటున్నావా? తెలుసుకోనివ్వను. నువ్వు నా ప్రేమనుతప్ప మరొకరి ప్రేమను రుచి చూడ డానికి వీల్లేదు. ఈ పెళ్ళి జరగనివ్వను."

"ఏం చేస్తావ్?"

"మీ నాన్నగారి దగ్గరకు వెడతాను..." అన్నాడు రాజశేఖరం.

రాజశేఖరం నాన్నగార దగ్గరకు వెళ్ళలేదు కానీ అన్నయ్యకు చెప్పుకున్నాడు. అన్నయ్యా నాన్నగారికి చెప్పాడు. నాన్నగారు ముందు మండిపడ్డాడు. మనది సంప్రదాయమయిన కుటుంబం, ఇంతవరకూ యెవ్వరూ తీసుకురాని మచ్చ తను తీసుకురాలే నన్నారు.

"చెల్లాయికూడా ఇష్టం నాన్నా!" అన్నాడు అన్నయ్య.

ఈ విధంగా ఇందులో నన్నుకూడా యిరికిస్తాడని నే ననుకోలేదు.

"ఇలా రమ్మను దాన్ని!" అన్నారు నాన్నగారు.

నేను వెళ్ళాను. నాకేమీ తెలియదన్నాను.

"మొన్న నేను కుదిర్చిన సంబంధం నీ కిష్టంలేదా?" అన్నారు నాన్నగారు.

"అంతా మీ యిష్టం. నాకేమీ తెలియదు. అన్నయ్య చెప్పింది నిజంకాదు" అని అక్కడ్నించి వెంటనే వెళ్ళిపోయాను. రాజశేఖరాన్ని పెళ్ళి చేసుకోవాలని నాకూ కోరికగా వుంది. ఆ విషయం నాన్నగారికి చెప్పడానికి భయం వేసింది. నాన్నగారితో నా ఇష్టం చెప్పడం కంటె ఆయన చెప్పినట్లు వినడమే మంచిదని నా పిరికితనం నాకు చెప్పింది.

నాన్నగారు అన్నయ్యను తిట్టారు. తర్వాత అన్నయ్య నా దగ్గరకు వచ్చి "రాజశేఖరం నా స్నేహితుడు. వాడు మంచివాడు. డబ్బుంది. వాడ్ని పెళ్ళి చేసుకుంటే అన్ని విధాలా నువ్వు సుఖపడగలవని నా నమ్మకం. నేను మీ పెళ్ళి జరిపిస్తే నీకు అభ్యంతరమా?" అన్నాడు.

"ఏమో నాకు తెలియదు. నాన్నగారి మాట కాదనడానికి నాకు భయం!" అన్నాను.

"పోనీ—రాజశేఖరమంటే నీకు ఇష్టమేనా?" అని అడిగాడు అన్నయ్య.

నాసిగ్గు అన్నయ్యకు జవాబు చెప్పింది.

ఆ మర్నాడు సాయంత్రం అన్నయ్య మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. వాడు చాలా కోపంగా ఉన్నాడు— "చూడమ్మా — మోహనా! నాన్నగారు చెప్పినట్లే చేయడం మంచిది. రాజశేఖరంగాడి మాట పూర్తిగా మరచిపోవాలి. వాడికీ మనకీ ఉన్న అంతస్తుల తేడా ఈరోజే నాకు తెలిసివచ్చింది. వాళ్ళ నాన్న దగ్గరకు వెళ్ళాను వాడిమాట పట్టుకుని. ఆయన నానా మాటలూ

అన్నాడు. డబ్బుకోసం ఆడదాన్నెరగాచూపడం భోగం వాళ్ళలోగానీ ఎరగం అన్నాడు. ఆయన మాటలు విన్నాక ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదనిపించింది.''

జరిగింది అర్థం చేసుకోగలిగాను. అన్నయ్య బాగా దెబ్బతిన్నాడు. ఆ తర్వాత రాజశేఖరం స్వయంగా క్షమాపణ చెప్పుకున్నప్పటికీ — ''మా చెల్లెలి పెళ్ళి విషయం మాట్లాడి మా అహంమీద దెబ్బతీయకు'' అనేశాడు అన్నయ్య.

ఆ తర్వాతకూడా రాజశేఖరం మా ఇంటికి వచ్చి వెడుతూనే వున్నాడు. అతన్ని చూసినపుడల్లా నా దురదృష్టానికి బాధ కలుగుతూండేది. నా కాబోయే వరుడు అతడి ముందు దివిటీలా వుంటాడు. రాజశేఖరంతో నా పెళ్ళి జరిగితే బాగుంటుందని మనసులో అనిపిస్తోంది నాకు. అప్పుడిందుకు వ్యతిరేకులు ఇంట్లో ఇద్దరున్నారు—నాన్నగారు, అన్నయ్య!

రాజశేఖరం నాతో ఏకాంతానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. పెళ్లైపోయాక అతన్ని కలుసుకోవడం కుదరదని నాకు తెలుసు. అతను నాకు దూరమైపోతాడంటే మనసులో బాధగానే వుంది నాకు.

''నాకు మా నాన్నతో నిమిత్తంలేదు. నువ్వుకూడా మీ కుటుంబంతో నిమిత్తం పెట్టుకోకు - నాతో వచ్చేసేయ్. మనమిద్దరం ఎక్కడికైనా వెళ్ళిపోయి హాయిగా జీవితం గడుపుదాం'' అన్నాడు రాజశేఖరం.

అలా నా కిష్టంలేదని చెప్పాను. అందుకు కారణం నాన్నగారిమీద ప్రేమ అని చెప్పలేను. రాజశేఖరాన్ని నమ్మమని ఏముంది? ఇలాంటి కథలు చాలా విన్నాం. ఇతగాడు నన్ను తీసుకువెళ్ళి తర్వాత ఎక్కడైనా వదిలేస్తే?

ఈ సమాజంలో ఏ ఆసరాలేని ఆడదానికి రక్షణ లేదు. అందుకే ఆడపిల్లలు బుద్ధిగా తలిదండ్రులు నిర్దేశించిన పెళ్ళిళ్ళు చేసుకుంటారు తప్పితే ప్రేమ పేరుతో రిస్కు తీసుకోలేరు.

"నన్ను నమ్ము మోహనా! నువ్వు లేకుండా బ్రతక లేను. నాతో వచ్చెసెయ్?"

ఇవే మాటలను కోరిక రూపంలో, ఆహ్వానం రూపంలో చాలాసార్లు నా దగ్గర అన్నాడతను. అతని కోరికను నేను లక్ష్యపెట్టలేదు. ఆహ్వానాన్ని మన్నించలేదు. వివాహం వీర్రాజుతో జరిగిపోయింది.

వీర్రాజు మనిషి మంచివాడేకానీ బొత్తిగా సంసార పక్షం మనిషి. ఆ తర్వాత కాస్త క్రమశిక్షణ పట్టింపు కూడా ఎక్కువ. ఇంట్లో అన్నిపనులూ ఒక పద్ధతిప్రకారం జరిగిపోవాలి. రాత్రి పక్కలో దగ్గరగా తీసుకోవడం మినహాయిస్తే పగటిపూట అతనివద్దనుంచి ఓ ప్రేమకబురు కానీ, సరసం కానీ వుండదు.

అతను చాలా తక్కువగా నవ్వుతాడు. నవ్వినపుడు చాలా బాగుంటాడు. అయితే అలా బాగున్న క్షణాలు చాలా తక్కువగా వుంటాయి. కోపంలేదు కానీ మనిషికి విసుగు ఎక్కువ. ఆ విసుగైనా క్రమశిక్షణలో లోపాలు కనబడ్డప్పుడే వస్తుంది.

క్రమశిక్షణ అంటే నాకు ఇష్టమే కాని మనిషిని మనిషిలా వుంచక యంత్రంగా మార్చే క్రమశిక్షణ అంటే నాకు చిరాకు. క్రమశిక్షణనుబట్టి కాక మూడ్‌సు బట్టి మసలడం నాకు ఇష్టం. అతనికి కాదు.

ఏ రోజు ఏవేం కూర చేయాలో, టిఫిన్ చేయాలో టైంటేబిల్ వుంటుంది. రుచులతో నిమిత్తం లేకుండా

ఆ టైం టేబుల్ ఫాలో అవ్వాల్సిందే! అలాగే ప్రతి శని వారమూ సాయంత్రం మొదటి ఆటకు సినిమా చూడాలి. మూడో శనివారంనాడు హిందీ సినిమా.

సినిమాల మంచిచెడ్డలతో నిమిత్తం లేకుండా, మనిషి మూడ్ ప్రసక్తిలేకుండా వెళ్ళడంవల్ల నాకు సినిమా ఆసక్తి కాస్త తగ్గింది. అంతా రొటీన్ జీవితం!

వీర్రాజుతో కాపురం నాకు అనుక్షణం రాజశేఖరాన్ని గుర్తుతెస్తోంది. అతని మాట విని అతడితో వెళ్ళిపోవలసిందేమో నని అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. మొత్తంమీద రెండేళ్ళకు పైగా కాపురం చేస్తూకూడా వీర్రాజు అలవాట్లకు అనుగుణంగా నా అలవాట్లు మార్చుకోగలిగాను కానీ అతణ్ని ప్రేమించలేకపోయాను. నా మనిషిగా అభిమానించలేకపోయాను.

ఇప్పుడు రాజశేఖరాన్ని చూడగానే కలిగిన గగుర్పాటు లాంటిది వీర్రాజును చూసినప్పుడు ఒక్క పర్యాయంకూడా కలగలేదు నాకు.

ఇద్దరం పార్కులోకి వెళ్ళగానే—"అలా కూర్చో!" అన్నాడు రాజశేఖరం.

నేను కూర్చున్నాను.

"నీతో చాలా మాట్లాడాలి!" అన్నాడు రాజశేఖరం.

"మాట్లాడు!" అన్నాను.

అతని నడక, మాట్లాడే పద్ధతి నన్ను ముగ్ధురాల్ని చేస్తున్నాయి. ఇన్నేళ్ళు వీర్రాజుతో కాపురం నాకు రాజశేఖరం పట్లగల ఆకర్షణను రెట్టింపు చేసినట్లుంది.

"నేను చెప్పేదానికి నువ్వేమీ అనుకోకూడదు. నేను చెప్పేది నువ్వు పూర్తిగా వినాలి!" అన్నాడు రాజశేఖరం. అతను కాస్త తడబడుతున్నాడని అనిపించింది.

"వినడానికేమీ అభ్యంతరం లేదు" అన్నాను.

"నాకు నీమీద ప్రేమ ఏమాత్రమూ చావలేదు..." అన్నాడు రాజశేఖరం.

ఆ మాటలు నాకు చాలా సంతోషాన్ని కలిగించాయి. నా విషయంలోనూ అంతేనని చెప్పాలనిపించింది కానీ అందుకు అభిమానం అడ్డువచ్చింది. మగవాడు చిన్న బుచ్చుకున్నంత త్వరగా ఆడదాన్ని నన్ను నేను చిన్న బుచ్చుకోలేక పోయాను. "ఊఁ" అన్నాను.

"ఊఁ ఏమిటి–ఎలాగో అలా నిన్ను నాదాన్ని చేసుకో వాలనుకుంటున్నాను" అన్నాడు.

"అదెలా సాధ్యం? నా పెళ్ళి జరిగిపోయింది" అన్నాను అప్రయత్నంగా.

"నిజమే—కానీ విధవా వివాహం అయితే నాకు చాలా సులువు. అప్పుడెవ్వరి అభ్యంతరాలూ నేను లెక్క చేయ నక్కరలేదు" అన్నాడు రాజశేఖరం.

## 2

ఉలిక్కిపడి "ఏమిటన్నావ్?" అన్నాను.

"తలిదండ్రులచాటు బిడ్డ వుందనుకో. ఆమెను పెళ్ళా డాలంటే చాలా అడ్డంకులుంటాయి. ఆ అడ్డంకులను దాటి ముందుకు రావడానికి ఆ బిడ్డ అంగీకరించదు. భర్త చాటు భార్య వుందనుకో–ఆమెకూ యింకో పురుషుణ్ని పెళ్ళి చేసుకోవడానికి కొన్ని అట్టంకులుంటాయి. వాటిని అధిగమించడానికి ఆమె సిధపడదు. విధవ విషయంలో యివన్నీ తారుమారు. ఆమెకు ఇష్టమయినా ఆమెను వివాహం చేసుకునేందుకు ముందుకువచ్చే పురుషులు చాల తక్కువ. అవునంటావా?"

"ఏమో–నాకంతగా తెలియదు. కానీ నువ్వు నన్ను

పెళ్ళిచేసుకోవాలనుకోడానికీ దీనికీ సంబంధమేమిటి?" అన్నాను.

"ఇంకా అర్థ కాలేదా? నీకోసం నేను హంతకుడ్ని కాబోతున్నాను."

"అంటే?" అన్నాను కంగారుగా.

"నీ భర్తను చంపేసి—నిరాధారురాలివయిన నిన్ను పెళ్ళిచేసుకుంటాను."

"చాలా బాగుంది" అన్నాను కంగారుగా. "హత్య చేస్తే పెళ్ళిమాట అటుంచి ముందు జైల్లో కడతావ్! ఆ తర్వాత వురితీసినా తీయవచ్చు."

"పోనీ మోహనా! నా తెలివితేటలమీద నాకు చాలానమ్మకముంది. పకడ్బందీగా పథకం వేసుకొని హత్యచేస్తాను. పట్టుబడనన్న విశ్వాసం నాకుంది. కర్మం చాలక పట్టుబడ్డానూ మరీ మంచిది. నిన్ను నాదాన్ని చేసుకోలేక పోయాక ఈ శరీరం వురికి గురయితే మాత్రం ఏం?" అన్నాడు రాజశేఖరం. అతని కళ్ళలో ఒకరక మైన దృఢనిశ్చయం, ఒక రకమయిన నిస్పృహ కనబడుతున్నాయి.

అతనిమాటలు వింటుంటే, చూపులు చూస్తూంటే, ఇలాంటివాడిని భాగస్వామిగా పొందే అదృష్టానికి దూర మయినానని బాధకలిగింది. అయినప్పటికీ కూడా— "జీవితం చాలా విలువయినది. నువ్వు తప్పుడు ఊహల్లో వున్నావు" అన్నాను అతనితో.

"నువ్వులేని జీవితం గుడ్డిగవ్వ విలువచేయదు నాకు" అన్నాడు రాజశేఖరం.

"అందుకని హత్యచేస్తావా? అటు నా భర్తను హత్య చేసి, యిటు నువ్వు జైలు పాలయితే నాగతి ఏంకావాలో

ఆలోచించేవా?'' అన్నాను. నిజానికి నా గురించిన స్వార్థం నాచేత ఈమాట లనిపించలేదు. రాజశేఖరం మనసు మార్చాలనే అలాగన్నాను.

"నా నిర్ణయం మారేదికాదు. నేను జైలుపాలు కానన్న నమ్మకం నాకుంది. ఒకవేళ జైలుపాలయితే నీ కర్మ!'' అన్నాడు రాజశేఖరం.

"నాకోసం నీ మనస్సు మార్చుకోలేవా?'' అన్నాను.

"మార్చుకుంటాను. కానీ నువ్వు నీ భర్తను వదలి నాతో వచ్చెయ్యాలి.''

పక్కన పిడుగు పడ్డట్లు అదిరి పడ్డాను. రాజశేఖరం మీద నాకు చాలా వ్యామోహమయితే వుందిగానీ సమాజానికి నచ్చని పని చేయలేను నేను. వీర్రాజంటే నా కిష్టం ఏర్పడలేదు గానీ నేనతన్ని వదలిపెట్టలేను. అతని నీడలో నేను బ్రతకాలని సమాజం శాసిస్తోంది. ఆ శాసనాన్ని వుల్లంఘిస్తే సమాజం నన్ను క్షమించదు.

"నువ్వడుగుతున్నది చాలా ఘోరంగా వుంది...'' అన్నాను.

"కన్నతండ్రిమాట కాదనలేక పోయావు. కానీ కట్టుకున్న భర్తను వదలిపెట్టడానికేం?'' అన్నాడు రాజశేఖరం సింపుల్‌గా.

"కట్టుకున్న భర్త కాబట్టే వదిలిపెట్టడం కష్టం!''

"అయితే నేను హంతకుడ్ని కాక తప్పదు'' అన్నాడు రాజశేఖరం.

"వద్దు'' అన్నాను.

"నువ్వు నాతో వచ్చేయడమో, నీ భర్త చావడమో ఈ రెండిట్లో కనీసం ఒక్కటయినా జరిగితీరాలి__'' అన్నాడు రాజశేఖరం.

"అయితే నాకు కాస్త ఆలోచించుకోవడానికి టైం యిస్తావా?"

"ఇస్తానుకానీ ఇచ్చేముందు ఒకచిన్న ప్రశ్న. నిర్మొహమాటంగా జవాబుచెప్పు. నేనంటే నీకు యిష్టమేనా?" అనడిగాడు రాజశేఖరం.

అతని ప్రశ్నకు నా కనులలో నీళ్ళు తిరిగాయి. చీర కొంగుతో ఒత్తుకుంటూ—"నా మనసులో ప్రేమంటూ వుంటే అది నీ ఒక్కడికోసమే! ఈ ఒక్కముక్క చెప్పడానికి నేను భయపడటంలేదు—ఇక్కడెవ్వరూ లేరు కాబట్టి. నువ్వంటే నాకిష్టం లేకపోవడమేమిటి రాజూ!" అన్నాను. అతన్ని నేను రాజూ అని ఎప్పుడూ పిలవలేదు. ఇప్పుడు పిలవాలనిపించింది.

"నా ప్రశ్నకు జవాబు నీ పిలుపులో నేవుంది మోహనా! చాలాచాలా థాంక్స్. ఒకవారం రోజుల్లో నిన్ను మళ్ళీ కలుసుకుంటాను. అప్పటికి నీ నిర్ణయం అయిపోవాలి"

## 3

సాయంత్రం వీర్రాజు వచ్చేసరికి వుప్మాటిఫిన్ చేసి సిద్ధంగా వున్నాను. బుధవారం నాడు సాయంత్రానికి అతను నిర్దేశించిన టిఫిన్ అది.

రోజూ మధ్యాహ్నం నిద్రపోతూంటాను. ఈరోజు బజారుకు వెళ్ళినపుడు రాజశేఖరంతో మాట్లాడినవిషయం యీరోజు మధ్యాహ్నం నాకు నిద్ర రానివ్వలేదు. యేం చేయాలో తోచకపోయినా రకరకాల ఆలోచనలు నా నిద్రను పాడుచేశాయి.

సరయిన నిద్ర—అందులోనూ రోజూ అలవాటయినది లేకపోవడంతో సాయంత్రానికి కడుపులో కాస్త వికా

రంగా వుంది. ఉప్మా తినాలని లేదు. నూనె లేకుండా యే ఇడ్లీ అయినా వేసుకుంటే బాగుండుననిపించింది. కానీ టైంటేబుల్ తప్పితే వీర్రాజు వూరుకోడుగదా!

సరిగ్గా అనుకున్న టయిముకు వీర్రాజు ఇంట్లో అడుగు పెట్టి కుర్చీలో కూర్చున్నాడు. నేను వెళ్ళి బూట్లు, సాక్సు విప్పాను. తర్వాత చేతులు కడుక్కొని ఇద్దరికీ చెరో ప్లేట్లోనూ టిఫినూ, రెండు గ్లాసులతో మంచినీళ్ళూ తెచ్చాను.

తనతోపాటే నేనూ టిఫిన్ తినాలంటాడు వీర్రాజు. అది ప్రేమపూర్వకమైన భర్తకోరిక కాక, బలవంతంగా విధించిన మిలిటరీ రూలులా వుండటంవల్ల కలసి టిఫిన్ తినే ఈ కార్యక్రమాన్ని నేను ఆనందించలేక పోతూన్నాను.

టిఫిన్లో ఏమయినా లోపాలుంటే తప్ప అతను మాట్లాడడు. టిఫిన్ తిని మంచినీళ్ళు తాగేక, అప్పుడు మేము యిద్దరమూ ఓ, అరగంట మాట్లాడుకోవచ్చు. నేను చెప్పదల్చుకున్నవన్నీ ఆ అరగంటలోనే ముగించేయాలి. అంతకుమించి ఒక్క క్షణంకూడా యెక్కువ వినడు వీర్రాజు. ఆ తర్వాత మళ్ళీ మాట్లాడుకునే అవకాశం మంచంమీదనే!

"ఈరోజు మీతో చాలా మాట్లాడాలి!" అన్నాను.

వీర్రాజు టైము చూసుకుని—"ఊఁ" అన్నాడు.

"మీ క్రమశిక్షణ నాకు చాలా విసుగ్గా వుంది. అందరిలాగా జీవించాలని నాకు కోరికగా వుంది..." అన్నాను. ఈ మాటలు చెప్పాలని చాలా కాలంగా అనుకుంటున్నాను. ఆ ధైర్యం మాత్రం—ఈరోజే వచ్చింది. అందుకు రాజశేఖరం చాలావరకూ కారణం కావచ్చు.

"నాతో కలిసి జీవించాలనుకుంటే ఈ పద్ధతి తప్పదు" అన్నాడు వీర్రాజు.

"మీతో కలిసి జీవిస్తూనే ఈ పద్ధతి అనుసరించక పోతే?"

"నిన్ను పుట్టింటికి పంపించేస్తాను" అన్నాడు వీర్రాజు చాలా మామూలుగా.

నాకు చాలా ఉక్రోషం వచ్చింది — "నేను కూడా మనిషినే అని మీరు గుర్తించారా? నాకూ కొన్ని ఆశ లుంటాయని మీరూహించలేరా? మీ నియమాలతో నా కోరికలన్నీ నశించిపోతే అదే మీకిష్టమా?"

వీర్రాజు ఉదాసీనంగా నవ్వి — "నీ ఆరోపణలకు అర్థంలేదు. నేనెలా జీవిస్తున్నానో అలాగే నిన్నూ జీవించ మన్నాను. నేను మనిషినైతే నువ్వూ మనిషివే అవు తావు" అన్నాడు.

అతను చెప్పింది నిజమే! అతను జీవితంలో ఆనందా న్ననుభవిస్తూ నన్ను దానికి దూరంచేస్తే నా ఆరోపణలకు అర్థముండేది.

"ఒకో మనిషికీ ఒకో పద్ధతి వుంటుంది. మీ పద్ధతులు మీవి. నా పద్ధతులు నావి. పెళ్ళి చేసుకున్నానుగదా అని అన్నీ మీ పద్ధతులే అనుసరించమనడం అన్యాయం. నా పద్ధతులు కొన్ని మీరుకూడా అనుసరిస్తే నాకూ తృప్తిగా వుంటుంది" అన్నాను.

"నీ తృప్తితో నాకు నిమిత్తం లేదు. ఆడది నాకు అవసరం కాబట్టి పెళ్ళి చేసుకున్నాను. అందుకు బాధ్యతగా నీకు తిండి పెడుతున్నాను. బట్టలు కొంటున్నాను. సర దాలు తీరుస్తున్నాను. నీ ఇష్టం వచ్చినట్లు నునులుకొందుకు రోజూ ఉదయం పదిగంటలనుంచి సాయంత్రం అయిదు

వరకూ వదిలిపెడుతున్నాను. ఇంతకు మించి నేనేమీ చేయలేను. ఇష్టమైతే నాతో వుండు. లేకపోతే వెళ్ళిపో" అన్నాడు వీర్రాజు.

అతని నిర్లిప్తతకు నాకు వళ్ళు మండింది. చాలా కాలంగా కాపురం చేస్తున్నా అతనంటే ప్రేమకలక్కపోవడానికి ఈ నిర్లిప్తతే కారణమేమోననుకున్నాను—"సరేలెండి! రోజూ ఉదయం పదినుంచి సాయంత్రం అయిదువరకూ నాకు స్వతంత్రమన్నారుగదా! ఆ సమయంలో పొరపాటునకూడా మీరు ఇంటికి రాకూడదు. అది పూర్తిగా నా సమయం—"

వీర్రాజు ముఖం అదోలాగైపోయింది — "నువ్వు రమ్మన్నా రాను. క్రమశిక్షణ అంటే క్రమశిక్షణే! ఎటొచ్చీ కానిపని ఏదైనా చేశావా భార్య అన్న కనికరం కూడా చూపను. క్రమశిక్షణ శరీరానికీ, మనసుకూకూడా అవసరం—"

కానిపని అంటే ఏమిటని నేనతన్ని అడగలేదు. అప్పటికే నేనో నిశ్చయానికి వచ్చేశాను. పర్యవసానం ఏమైనా భరించడానికి సిద్ధంగా వున్నాను.

"ఇంకా ఏమైనా చెప్పదల్చుకుంటే చెప్పు. అయిదు నిముషాలు మాత్రమే వ్యవధి వుంది" అన్నాడు వీర్రాజు.

నాకు చిరాకువేసింది "ఇంకేమీ లేవు - మీకు రెండు వుత్తరాలు వచ్చాయి. తెచ్చి ఇస్తానుండండి" అంటూ అక్కణ్నించి లేచాను.

వీర్రాజు పేరున ఎప్పుడూ కవర్లే వస్తాయి. అతని పేరున వచ్చినవాటిని నేను చింపి చదవడానికి వీల్లేదు. నాకు పనికి వచ్చే సమాచారముంటే అతనే చదివి వినిపిస్తాడు. అందుకే అన్నయ్యానూ, వాళ్ళనూ నా పేరునే ఉత్తరాలు వ్రాయమంటూంటాను.

# 4

“రాజూ! నా భర్తపై ప్రేమ పెంచుకుందామని నేను చేసిన ఆఖరు ప్రయత్నంకూడా విఫలమయింది. అతన్ని నేను ప్రేమించలేను. నాకు జరిగే అన్యాయంతో అతనికి నిమిత్తం లేదన్నాడు. కాబట్టి అతనికి అన్యాయం జరిగితే నాకూ బాధలేదు. సమాజాన్నెదిరించే ధైర్యం కలిగే దాకా అతని నీడలోనే వుంటూ నీతో సుఖపడదల్చుకున్నాను. అంతకుమించి ప్రస్తుతానికి నీకు సహకరించలేను” అన్నాను.

రాజశేఖరం ఆరాధనాపూర్వకంగా నా వంక చూసి “ఆ రోజు లభించిన తొలిముద్దు ఇప్పటికీ నాకు గుర్తుండిపోయింది మోహనా! నువ్వు నన్ను పూర్తిగా కరుణిస్తానంటే అంతకంటే అదృష్టమేముంది? త్వరలోనే నీలో పూర్తిగా మార్పు రాగలదని ఆశిస్తున్నాను. అయితే మనం ఎప్పుడు కల్సుకుంటాం?” అన్నాడు.

“ఇప్పుడు టైము పదకొండయింది. సాయంత్రం అయిదువరకూ నాకు స్వేచ్ఛ. అయితే మూడింటినుంచి ఇంటిపనులు ప్రారంభించుకోవాలి” అన్నాను. అప్పుడే నా మనసులో ఏదో థ్రిల్ బయల్దేరింది.

రాజశేఖరం ఉత్సాహంగా “మా ఇంటికి పోదామా?” అన్నాడు.

“మీ ఇంట్లో ఎవరున్నారు?”

“ప్రస్తుతం ఎవ్వరూ లేరు!”

నాకోసం ఈ ఊరువచ్చి ఓ ఇల్లు తీసుకుని అందులో మకాం పెట్టిన రాజశేఖరం ఇంట్లో వేరే ఎవ్వరుంటారు? నా ప్రశ్నకు నేనే నవ్వుకుని “ఎవరూ అనుమానించరు కదా?” అని అడిగాను.

"నేనున్న వీధి పట్టపగలే నిర్మానుష్యంగా వుంటుంది. ఏ ప్రమాదమూ వుండదు" అన్నాడు రాజశేఖరం. ఇద్దరం పార్కులోంచి కదిలి రిక్షా ఎక్కి అతనింటికి వెళ్ళాం. అదృష్టవశాత్తూ ఎవ్వరికంటా పడలేదు.

రాజశేఖరం ఇల్లు అన్ని హంగులతో చాలా బాగుంది. మా ఇద్దరికీ ఏకాంతం లభించగానే అతను విపరీతంగా ఆవేశపడిపోయాడు. ఆ ఆవేశం నాకు నచ్చినా తొలి నాటిలా అతనిముందు సిగ్గుపడ్డాను. అయితే ఒక్కక్షణం కూడా తప్పుచేస్తున్నానన్న ఆలోచన నాలో రాలేదు. ఇన్నాళ్ళుగా ఎంతో సుఖానికి దూరమయ్యానన్న దిగులు నన్ను ఆవహించింది. లోపం వీర్రాజుదో, నా మనస్తత్వానిదో తెలియలేదు.

టైము మూడయ్యేసరికి నాకు చాలా కంగారు పుట్టింది. ఇంత త్వరగా కాలంగడవడం ఈ మధ్యకాలంలో నే నెరగను. ఇంటికి వెళ్ళి చేసుకోవలసిన పనులు చాలా వున్నాయి. ఇప్పుడు బయల్దేరి ఇల్లుచేరి పనులు మొదలు పెట్టాలి. అయిదయ్యేసరికి వీర్రాజుకు టిఫిన్ రెడీ చేయాలి. అందులోనూ టిఫిన్ దోసెలు.

రాజశేఖరం నా సమస్య విని "ఈ రోజుకు హోటల్లో కానేసేయ్" అన్నాడు.

"అలా ఆయన ఒప్పుకోరు" అన్నాను.

"వంట్లో బాగోలేదని పడుకో" అన్నాడు రాజశేఖరం.

"వెంటనే డాక్టర్ని పిలుస్తాడు."

"వళ్ళు నెప్పులను. అదెవ్వరూ కనుక్కోలేని రోగం. తిండికూడా మానక్కర్లేదు."

"ఒళ్ళు నెప్పులైనా సరే పనిచేసి తీరాలి. అలాంటి రోగాలకు అడ్వాన్సు నోటీసివ్వాలి."

"ఇలాంటివాడూ వొరికాడేమిటి మోహనా నీకు!" అంటూ రాజశేఖరం ఆలోచనలోపడి ఓ ఉపాయం చెప్పాడు. ఆ ప్రకారం హోటల్లో దోసెలపు బదులు పిండి కొనుక్కోవాలి.

సాధారణంగా హోటలువాళ్ళు దోసెలపిండి అమ్మరు కానీ రాజశేఖరం సంపాదించగలిగాడు. అతనికి ధన్య వాదాలు చెప్పకుని ఇల్లు చేరేసరికి పావు తక్కువ నాలు గయింది. వెళ్ళివెళ్ళగానే బట్టలుతికేశాను. రోజూకంటే చలాకీగా పనిచేశాను. వీర్రాజు వచ్చేసరికి టిఫిన్ సిద్ధం అయింది.

అతను రావడం, కుర్చీలో కూర్చోవడం నేను వెళ్ళి బూట్సు, సాక్సు విప్పడం, ఇద్దరం కలిసి టిఫిన్ తినడం అన్నీ యాంత్రికంగా జరిగిపోయాయి. ఈ పనులన్నీ రాజ శేఖరంతో అయితే ఎలా జరుగుండేవా అని ఆలోచిస్తూంటే వీర్రాజుపట్ల నా జుగుప్స పెరిగింది.అయితే అంతరాంతరా లలో నాలోని స్త్రీ హృదయం వీర్రాజుపట్ల జాలిని ప్రద ర్శించడానికికూడా ప్రయత్నిస్తోంది.

"విశేషాలేమైనా వున్నాయా?" అన్నాడు వీర్రాజు.

"విశేషాలు మనుషులకు గానీ యంత్రాలకెందు కుంటాయి?" అన్నాను.

"ఇలాంటి మాటలు నా కిష్టముండవు. చేతనైతే మృదువుగా మాట్లాడు. లేకపోతే నోర్మూసుకుని కూర్చో!" అన్నాడు వీర్రాజు.

నేనింక మాట్లాడలేదు. బూడిదలో పన్నీరు పోయ డమూ వీర్రాజుతో మృదువుగా మాట్లాడడమూ నాకు బాగుండదు.

ఇప్పుడు నాకు క్షణం యుగంలా గడుస్తోంది. మళ్ళీ

రేపు రాజశేఖరంతో నిన్నూహించుకుంటూ ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను.

# 5

ఒకటికాదు రెండుకాదు — వరుసగా వారంరోజులు రాజశేఖరాన్ని కలుసుకున్నాను.

అతనిప్పుడు నాకు వ్యసనంగా పరిణమించాడు. అతని ఆకర్షణకు నేను పూర్తిగా లొంగిపోయాను. వీర్రాజుతో అన్నిరకాల బంధాలూ తెంచుకుని రాజశేఖరంతో వెళ్ళిపోవాలని నాకు అప్పుడప్పుడు అనిపించినా వివేకం హెచ్చరిస్తోంది. వీర్రాజు నీడను వదలకుండానే అన్ని సుఖాలూ అనుభవించమంటోంది. ఆ విధంగా వీర్రాజుమీద నాకుగల కసి, కోపం పరోక్షంగా తీరుతాయని భావిస్తున్నానేమో!

ఎనిమిదవరోజు మధ్యాహ్నం రాజశేఖరం నా గుండెల మీద నిద్రపోతున్నాడు. ఆ సమయంలో నేనేదో ఆలోచిస్తున్నాను. నిద్రరావడం లేదు. అప్పుడు సమయం ఒంటిగంట అయ్యుంటుంది. గుమ్మంలో ఏదో నీడలాతోచి ఉలిక్కిపడ్డాను. అటు చూసేసరికి మరింత ఉలిక్కిపడ్డాను.

సుమారు పాతికేళ్ళ యువకుడు నావంక చూస్తున్నాడు. అతనక్కడికి ఎలా వచ్చాడు? ఎందుకు వచ్చాడు? నేను తడబడి మంచంమీంచి లేవబోయాను. దురదృష్టవశాత్తూ నా వంటిమీద బట్టలు సరిగ్గాలేవు. చటుక్కున కదలలేకపోయాను. రాజశేఖరాన్న లేపడానికి ప్రయత్నించాను. అతనికి గాఢనిద్ర పట్టేసింది.

రాజశేఖరాన్ని నిద్రలేపవద్దన్నట్లుగా ఆ యువకుడు నన్ను వారించాడు. ఆ పరిస్థితిలో ఏం చేయాలో తోచ

లేదు. ఎలాగో అలా సర్దుకుని లేచాను. అతను నన్ను రమ్మని పిలుస్తున్నాడు. నేను బట్టలు సరిచేసుకుని అతన్ని సమీపించాను.

"రాజశేఖరం నా స్నేహితుడు. ఈ ఇల్లు నాది. కొంత కాలంపాటు కావాలంటే ఉపయోగించుకోమన్నాను కానీ ఇలాంటి పనికని తెలియదు. ఎవర్నువ్వు?" అనడిగాడతను.

"నా గురించి నేను చెప్పాలో లేను" అన్నాను. నాకు చాలా అవమానంగా వుంది. ఇంట్లోకి ఎవరూ రారని రాజశేఖరం కచ్చితంగా చెప్పడంవల్ల తలుపులు దగ్గరగా మాత్రం వేసుకున్నాం. ఇంతలో ఇలా ప్రమాదం ముంచుకొచ్చింది.

"చూడ్డానికి మర్యాదస్తురాలిలాగున్నా—నువ్వు చేసే పని గౌరవమైనదికాదు. అయినా నేనిక్కడికి నీకు నీతులు చెప్పడానికి రాలేదు. నేను చేసే అనేక మంచిపనులలో మహిళా సంక్షేమం ఒక్కటి! నువ్వు డబ్బుకోసం రాజశేఖరాన్ని పట్టివుండవచ్చు. అందుకు నీ మనస్తత్వంకూడా కొంతవరకూ కారణం కావచ్చు. నీ కెవ్వరూ లేని పక్షంలో మా మహిళామండలి సభ్యురాలివి కావచ్చు. నీలాంటి అభాగ్యురాండ్రు చాలామంది వున్నారక్కడ" అన్నాడతను సీరియస్‌గా.

నవ్వాలో ఏడవాలో తెలియలేదు నాకు—"అలాంటి అవసరం లేదు నాకు" అన్నాను. ఎదుటి మనిషికి లోకువయ్యే పరిస్థితుల్లో నన్ను నేనుంచుకున్నందుకు నాకు చాలా బాధకలిగింది.

అతను వదిలిపెట్టలేదు. ఆడదానికి శీలం ఎంత ముఖ్యమో వివరిస్తూ—చెడిపోయినంత మాత్రాన భయపడనవసరం

లేదనీ తన మహిళామండలి సభ్యురాండ్రకు చాలామందికి పెళ్ళిళ్ళు తనే జరిపించాననీ చెప్పాడు.

నాకు విసుగువచ్చి "నేనూ రాజశేఖరం ప్రేమించుకున్నాం. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం" అని చెప్పేశాను. ఆ విధంగానైనా అతడి బెడద వదలవచ్చునని నాకు అనిపించింది.

అయితే అతనింకా నన్ను వదల్లేదు "అబద్ధాలు చెప్పవద్దు. రాజశేఖరం గురించి నాకు బాగా తెలుసు. వాడొకర్ని మోసగించే మనిషి కాడు" అన్నాడు.

"అవును. ఆ సంగతి తెలుసు కాబట్టే నన్నతనికి అర్పించుకోగలిగాను."

"కానీ వాడికి ఏణ్ణర్ధం క్రితమే పెళ్ళయింది" అన్నాడతను.

"సో వాట్! నాకూ రెండేళ్ళ క్రితం పెళ్ళయింది. అతడికి భార్య నచ్చలేదు. నాకు భర్త నచ్చలేదు. అదీ సంగతి!" అన్నాను.

ఈసారి ఆశ్చర్యపోవడం అతనివంతమయింది "నీకు పెళ్ళయిందా? అయితే భర్తను మోసంచేసి" అని ఆగిపోయాడు.

అప్పుడే రాజశేఖరం లేచాడు.—"అవున్రా - ఈమె మిసెస్ వీర్రాజు!"

ఆ యువకుడు నోరు తెరిచి "ఈజిట్!" అన్నాడు.

రాజశేఖరం అలా చటుక్కున నా భర్త వివరాలను ఆ యువకుడికి చెప్పడం నాకు నచ్చలేదు "మిస్టర్ రాజశేఖరం! నిన్ను నమ్మి వచ్చినందుకు నా బ్రతుకు వీధిలో పడేస్తావా? ఇదేనా నువ్వు నాకు చేయబోయే ప్రత్యుపకారం!" అన్నాను.

"అదేమిటి మోహనా! అలాగంటావ్ - వాడు నా స్నేహితుడు..."

"ఏమీ అనుకోవద్దు మిసెస్ వీర్రాజూ! వీర్రాజుతో వాళ్ళొక పని వుంది. అది నీవల్లనే కావాలి. రాజశేఖరానికి నువ్వు ప్రియురాలివి కావడం నా అదృష్టం" అన్నాడు ఆ యువకుడు.

"ఏమిటిదంతా రాజూ!" అన్నాను చిరాగ్గా.

"నీ కోసం వాడికి లొంగిపోయాను మోహనా! వాడు మనిద్దరికీ ఈ అవకాశం ఇచ్చినందుకుగానూ ఓ ప్రతిఫలం కోరుతున్నాడు. అందులో ప్రమాదమేమీ లేదు. వాడు చెప్పినట్లు విను" అన్నాడు రాజశేఖరం.

ఏం చేయాలో నాకు తోచలేదు. ఆ యువకుడి వంక తిరిగాను.

"నా పేరు జయదేవ్!" అంటూ ప్రారంభించాడతను.

# 6

మంచినీళ్ళ గ్లాసులో టాబ్లెట్ వేశాను. అది కరగడానికి కొద్దిసేపు పట్టింది. తర్వాత దాన్ని వీర్రాజు కంచం పక్కన పెట్టాను.

పెద్ద కబుర్లేమీ లేకుండానే ఇద్దరి భోజనాలూ అయిపోయాయి. ఏ అనుమానాలూ లేకుండానే వీర్రాజు మంచినీళ్ళు తాగేశాడు. వీర్రాజుకి వెంటనే ఏమీ కాలేదు. ఎటొచ్చీ తొమ్మిదిన్నరకు మంచంమీద వాలుతూనే అతను నిద్రపోయాడు. ఒక పదినిముషాలాగి నేను అతన్ని కదిపిచూశాను. ఇంచుమించు శవంలా వున్నాడు.

అప్పుడతని మొలలోంచి తాళంచెవులు తీశాను.

పగలల్లా జేబులో వుండే తాళంచెవులనతను రాత్రి పడుకోబోయే టప్పుడు మొలలో వుంచుకుంటాడు

అందులో పెద్ద రహస్యమేమీ లేదు కానీ నాకు అందు బాటులో లేనిది ఒకేఒక ట్రంకుపెట్టె వుంది.

రోజూ రాత్రి భోజనానికి ముందు ఓ గంటసేపు ఆ పెట్టెముందు కూర్చుంటాడతను. అందులో ఏముంటాయో నాకు తెలియదు. నేను దానిగురించి ప్రశ్నించకూడదని అతను కచ్చితంగా చెప్పేశాడు. అతనిపట్ల నాకు ఏర్పడిన విముఖత కారణంగా నేనా పెట్టె రహస్యం గురించి మరీ ఎక్కువగా ఆలోచించలేదు.

తాళాల గుత్తి తీసుకుని పెట్టె దగ్గరకు వెళ్ళాను. పెట్టె తెరచి కుతూహలంగా చూశాను. లోపల చెప్పుకో దగ్గ విశేషాలేమీ లేవు. అరడజన్ బైండు పుస్తకాలూ, నాలుగు ఫైల్సూ వున్నాయి.

ఓ బైండు పుస్తకం తీశాను. అందులో ఎన్నో పేర్లు, చిరునామాలు వున్నాయి. అవన్నీ ఏమిటో, ఎందుకో నాకు తెలియలేదు. రెండో బైండు పుస్తకంలో ప్రతి పేజీలో కొన్ని అంకెలున్నాయి. మూడో పుస్తకంలో పేజీకి ఒకటి చొప్పున చిన్న కథలున్నాయి. నాలుగో పుస్తకంలో దేశంలోని ఊళ్ళ పేర్లూ, తారీఖులూ వున్నాయి. ఫైల్సు నిండా ఎక్కడెక్కడివో రసీదు లున్నాయి.

ఎంత ఆలోచించినా ఒక్క విషయంకూడా నా బుర్ర కెక్కలేదు.

సరిగ్గా రాత్రి పదిన్నరకు వెళ్ళి వీధితలుపులు తీశాను. గుమ్మం దగ్గర జయదేవ్ వున్నాడు. అతను లోపలకు రాగానే తలుపులు వేసేశాను.

"వీ్రరాజుకు నిద్రపట్టేసిందా?"

"ఊఁ" అన్నట్లు తలాడించాను.

"ఆ పెట్టె తాళం ఏదీ!" అన్నాడు జయదేవ్.

చూపించాను. జయదేవ్ జేబులోంచి ఓ మైనపుముద్ద తీశాడు. ట్రంకుపెట్టె తాళాన్ని మైనపుముద్దమీద బలంగా వత్తాడు. తర్వాత నాకు తాళం తిరిగి ఇచ్చేసి — "దీనికి నకలు తయారుచేస్తున్నాను. అది నీకిస్తాను. దాన్నుపయోగించి మేము అడిగినప్పుడల్లా ఆ పెట్టెలోని పుస్తకాలూ కాగితాలూ మాకు ఇస్తూండాలి. వాటికి ఫోటో కాపీలు తీసుకుని మళ్ళీ నీకు తిరిగి ఇచ్చేస్తాం. తెలిసిందా?" అన్నాడు.

"ఎందుకిదంతా?" అన్నాను.

"నీ భర్త పనిచేస్తున్నది పేరుకు ఆఫీసు కానీ అక్కడున్నదంతా స్మగ్లింగ్ వ్యవహారమే! దేశం మొత్తంమీద పెద్ద ఎత్తున స్మగ్లింగ్ కొనసాగిస్తున్న ప్రేమ్‌చంద్‌కు ఇలాంటి ఆఫీసులు చాలా ఊళ్ళలో వున్నాయి. మీ ఆయన ఇక్కడి ఆఫీసులో కీలక పాత్ర వహిస్తున్నాడు. అతడివద్ద ఎప్పుడెప్పుడు, ఏయే నగరాలలో, ఏయే వ్యక్తులతో వ్యవహారాలు జరుగుతున్నాయో వివరాలుంటాయి. అంకెలు, మాటలతో వాళ్ళుపయోగించే కోడ్ రహస్యాలుంటాయి. ఇవి తెలుసుకోవడానికి చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాము. దొంగతనం జరిగితే క్షణాలమీద వాళ్ళు పద్ధతులన్నీ మార్చేస్తారు. అందుకని వాళ్ళకు తెలియకుండా ఈ రహస్యాలు సంపాదించే మార్గంకోసం అన్వేషిస్తున్నాను. ఇన్నాళ్ళకు రాజశేఖరం ధర్మమా అని నువ్వు దొరికావు" అన్నాడు జయదేవ్.

"నువ్వు పోలీసుల మనిషివా?" అన్నాను భయంగా. వీర్రాజు స్మగ్లింగ్ వ్యవహారాల్లో వున్నాడంటే నాకు ఆశ్చర్యంగానూ, భయంగానూ వుంది.

"కాదు. మాది ప్రేమ్‌చంద్‌కు పోటీ సంస్థ. ప్రస్తుతం ప్రేమ్‌చంద్ పోటీని తట్టుకోలేకుండా వున్నాం. వీళ్ళ రహస్యాలు తెలుసుకుంటేకానీ లాభం లేదు. అందుకే నిన్ను పట్టాను."

"ఆయనకేం ప్రమాదం కలగదా ఇందువల్ల?"

"కలగదు. సమాచారం లీక్ అయినట్లు ప్రేమ్‌చంద్‌కు అనుమానం కలగని విధంగా మేము వర్తిస్తాము. ఒకవేళ అనుమానం కలిగినా ఎక్కణ్నించి లీక్ అయిందో తెలుసుకోవడం వాళ్ళ తరంకాదు. లీక్ అయినట్లు వాళ్ళకు తెలియడం మాకూ నష్టమే!" అన్నాడు జయదేవ్.

ఈ వ్యవహారం నాకు వింతగా వుంది. వీర్రాజు క్రమశిక్షణ పేరుతో తనకు సంబంధించిన రహస్యాలు నాకు తెలియకుండా వుంచుతున్నాడా?

జయదేవ్ వంక చూసి "నీ పని అయిందిగదా-వెళ్ళు!" అన్నాను.

"ఇంకా పూర్తికాలేదు" అంటూ అతను నా నడుం చుట్టూ చేయి వేశాడు.

ఇది నేనూహించలేదు. చటుక్కున చేయి తొలగించి "నేను నీ మిత్రుడు రాజశేఖరానికి కాబోయే భార్యను" అన్నాను.

"రాజశేఖరం చేసుకోబోయేది వీర్రాజు వాసనచూసిన పువ్వు నేకదా—ఇంతలో నీ పవిత్రత చెడిపోదు. అనవసరంగా గొడవచేయకు. రాజశేఖరానికి చెప్పనులే!" అన్నాడు జయదేవ్ నా నడుంచుట్టూ చేయివేసి.

ఆ చేయి మళ్ళీ తోసేసి—"నన్నుగురించి ఏమనుకుంటున్నావ్!" అన్నాను.

"కనీసం ఇద్దరు మగవాళ్ళతో వుంటున్న ఆడదానివి

నువ్వు. ఇద్దర్నీ ఇష్టపడ్డదానికి మరొకడంటే ఇష్టపడ్డం కష్టంకాదు. అలాకాక ఇద్దరిలో ఒకరంటే ఇష్టంలేదంటావా? ఇష్టంలేకుండా ఓ మగవాడితో ఎలాగూ వుంటున్నప్పుడు నాతోనూ వుండవచ్చు. ఇష్టాన్ని త్యాగం చేయడమూ, పవిత్రతను చెడగొట్టుకోవడమూ – రెండూ అలావాటే నీకు. నన్ను కావనకు...'' అన్నాడు జయదేవ్ మళ్ళీ తన చేతిని నడుంచుట్టూ వేస్తూ.

ఈసారి ఆ చేతిని తీసివేయలేకపోయాను. నా మనసులో ఏదో భయం కలిగింది. నే నెటువైపు పయనిస్తున్నాను? నా జీవితం ఏం కాబోతోంది?

ఒకప్పుడు రాజశేఖరం నన్ను తనతో వచ్చేయమని పదేపదే అడిగితే సమాజం అంగీకరించని పని చేయలేక ఊరుకున్నాను. ఇప్పుడు పీర్రాజు నీడలో వుంటూ రాజశేఖరాన్ని ప్రోత్సహిస్తున్నాను. అతనికే నన్నర్పించుకున్నాను. ఇప్పుడు జయదేవ్ నన్ను కోరుతూంటే వారించలేని దుర్గతికి దిగజారిపోయాను.

రాజశేఖరమంటే ఇష్టపడి అతనికి నన్ను నేను సమర్పించుకున్నాను. కాని ఇప్పుడు జయదేవ్ కు లొంగిపోవడం నాకేమాత్రమూ ఇష్టంలేదు. అయినా తప్పడం లేదు. అతనికి నా గురించిన కొన్నిరహస్యాలు తెలిశాయి. ఆ రహస్యాలు అతను దాచడంకోసం నేను అతను చెప్పినట్లు వినాలి.

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో జయదేవ్ మా ఇల్లు వదిలాడు.

## 7

''ఏమిటిది — ఇలా సరాసరి ఇంటికొచ్చేశావ్?'' అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం చేయను మోహనా! నిన్ను వదిలి వుండలేను. ఈ రోజు నువ్వెందుకు రాలేదు?" అన్నాడు రాజశేఖరం.

"ఆ ఇంటికి రాలేను. జయదేవ్ మంచివాడు కాడు. నీ మాటలు నమ్మి చాలా ఇబ్బందిలో పడ్డాను. ఆ ఇంటి కింకా వచ్చేనంటే నాకు చాలా పెద్ద ప్రమాదాలు కలగ వచ్చు. ఇప్పటికి జరిగింది చాలు" అన్నాను.

రాజశేఖరం ముఖం బాధగా అయిపోయింది "ఇలాంటి ప్రమాదం ఊహించి వుంటే నేను జయదేవ్ ఇంట్లో మకాం తీసుకుని వుండేవాణ్ని కాదు" అన్నాడు.

"అయిందేదో అయిపోయింది. మన ఇద్దరి విషయం మరో వ్యక్తికి తెలిసిపోయింది. ఇంకా ముసుగులో గుద్దు లాట ఎందుకు? మన మెక్కడికైనా వెళ్ళిపోదాం?" అన్నాను.

"అలా కుదరదు. జయదేవ్ కు కనీసం కొన్ని నెలల పాటు నీ అవసరముంది. అంతకాలం నువ్వు వీర్రాజు నీడలో వుండక తప్పదు. అలా వుండని పక్షంలో మనిద్ద రికీ కూడా ప్రమాదం. వాడు చాలా ప్రమాదకరమైన మనిషి..."

"జయదేవ్ కు నువ్వు భయపడుతున్నట్లు కనబడు తోంది. వాడు చెప్పినట్లల్లా వినమంటున్నావ్. వాడు నన్నే కోరితే ఏం చేయాలి?" అన్నాను కోపంగా.

"వాడు నిన్ను కోరాడా?" అన్నాడు రాజశేఖరం. ఆవేశంతో అతని కళ్ళు ఎర్రబడ్డాయి—"నువ్వు చెప్పింది నిజమే అయితే వాణ్ని చంపేస్తాను. ఆ తర్వాత నేనేమై పోయినా ఫరవాలేదు."

అతని ఆవేశం నిజమైనదేననిపించింది. అందుకే అతన్ని శాంతపరిచి—"అలాంటివాళ్ళ సహవాసం మనకు మంచిది

కాదు. వాడు నావైపు చూసే చూపులు బాగోలేవు. ఎప్పటికైనా వాడివల్ల నాకు ప్రమాదముంది'' అన్నాను.

''ప్రస్తుతానికి నేను చేయగలిగింది వాడిల్లు వదిలిపెట్టడమే! ఎవరి గొడవాలేకుండా మనం సుఖంగా కలుసుకోవడానికి కాస్త ఖరీదయినదే అయినా ఓ మార్గముంది. ఈ ఊళ్ళో శోభాలాడ్జి వుంది. అందులో గదికి అద్దె చాలా ఎక్కువ. అన్ని సదుపాయాలూ వుంటాయి. రేపు మనం అక్కడ కలుసుకుందాం'' అన్నాడు రాజశేఖరం.

''ఏం మనిషివి నువ్వు? పట్టపగలు లాడ్జికి రమ్మని పిలుస్తున్నావ్—''

''అదేమిటి మోహనా? అలాగంటావ్. నీ గురించే కదా నేను అన్నిపనులూ వదులుకుని ఈ ఊళ్ళో మకాం పెట్టాను'' అన్నాడు రాజశేఖరం.

''అదికాదు. గౌరవనీయులయిన వాళ్ళెవరయినా లాడ్జికి వెడతారా?''

రాజశేఖరం నవ్వి, ''అయితే శోభాలాడ్జి గురించి నీకు తెలిసింది చాలా తక్కువన్నమాట! అన్ని సమయాలలోనూ అక్కడికి ఆడవాళ్ళూ, మగవాళ్ళూ వస్తూపోతూ వుంటారు. వచ్చే వాళ్ళందరూకూడా సమాజంలో పెద్ద పెద్ద హోదాలో వున్నవాళ్ళే! ఆయ్యేయస్సాఫీసర్ల భార్యలూ, వ్యాపారస్థుల కూతుళ్ళూ—చాలా సమయం అక్కడే గడుపుతూంటారు'' అన్నాడు.

''అవినీతి మరీ బట్టబయలుగా వుందంటావా అక్కడ''

''పాపంమాట లెందుకూ! నాకేమీ తెలియదు. గొప్ప గొప్ప వాళ్ళందరూ అక్కడ మకాం చేస్తారు కాబట్టి గొప్ప గొప్పవాళ్ళక్కడికి చూడ్డానికి రావడం జరుగు

తూంటుంది. కావాలనుకున్న వాళ్ళు గదుల్లో ఆడపిల్లలతో ప్రయివేట్ గా వుండవచ్చునని మాత్రం నేను విన్నాను తప్పితే అక్కడికందరూ అలాంటి పనిమీద నే వెడుతున్నారని అనుకోను...'' అన్నాడు రాజశేఖరం.

అతని మాటలు వింటూంటే అక్కడికి వెళ్ళడం మంచిదేననిపించింది. డబ్బిచ్చి వుండే హోటల్ కాబట్టి, కొత్త ఇబ్బందులేమీ ఎదురుకావనిపించింది.

మర్నాడు సరిగ్గా పావుతక్కువ పదకొండు గంటలకు శోభాలాడ్జికి వెళ్ళాను.

అక్కడి వైభవం చూస్తే నాతల తిరిగిపోయింది. భవనమూ, ఏర్పాట్లూ అంతఘనంగా వుంటాయని నేను వూహించలేదు. అక్కడున్న మగవాళ్ళందరూ ఫుల్ సూట్లలో వున్నారు. ఆడవాళ్ళు చాలా గొప్పవాళ్ళలా అగుపిస్తున్నారు. ఒకరిగురించి ఒకరు పట్టించుకునేవారు చాలాతక్కువ.

నేను తిన్నగా రూమ్ నెంబర్ పన్నెండులోకి వెళ్ళాను. తలుపులు దగ్గరగా మాత్రమే వేసివున్నాయి. తోయగానే తెరచుకున్నాయి. అక్కడున్న సోఫాలో రాజశేఖరం కూర్చుని వున్నాడు. నన్ను చూస్తూనే అతనొక అడుగు ముందుకువేసి పాదివి పట్టుకొని–చేయిజాపి డోర్ లాక్ చేశాడు.

అది ఎయిర్ కండిషన్డ్ గది. చల్లగా హాయిగావుంది. ఆ చల్లదనానికి రాజశేఖరం స్పర్శ అద్భుతమైన కాంబినేషన్! నామీద ఏం మత్తుమందు చల్లాడో ఏమోకానీ అతనికి నేను నానాటికీ పూర్తిగా ఎందుకు లొంగిపోతున్నానో అర్థంకావడంలేదు.

# 8

ఆ రోజు ఎంత వుత్సాహంగా గడిచిందంటే జీవితమంతా అక్కడే వుండిపోవా లనిపించింది. టైము రెండు దాటేసరికి నిరుత్సాహంకూడా ఆవరించింది నన్ను.

జయదేవ్ ఇంటికీ శోభాలాడ్జికీ చాలా తేడావుంది. వయసులోవున్న నవదంపతుల్ని దృష్టిలో వుంచుకుని గదిలో అన్నిరకాల ఏర్పాట్లూ చేయబడ్డాయి.

ఆ గదిలోంచి బైటకు వెళ్ళిబోయే ముందు నాకు కాల చక్రం గబగబా తిరిగిపోయి మళ్ళీ రేపు రావాలనిపించింది. అప్పటి నా ఆలోచనలు తల్చుకుంటూంటే నేనెలాంటి మనిషినో నాకే తెలీకుండా పోతోంది.

ఆడవాళ్ళందరి ఆలోచనలూ ఇలాగే వుంటాయా? అవకాశం వస్తే అందరు ఆడవాళ్ళూ ఇలాగే ప్రవర్తిస్తారా? నాలో నైతిక విలువ నశించిపోడానికి కారణం నా మనస్తత్వమా లేక పరిస్థితులా?

ఇలాంటి రకరకాల ఆలోచనలు నన్ను ముసురుకుంటుంటే సమాధానం గురించి ఆలోచించకుండా నా అదృష్టాన్ని కాలానికి వదిలిపెట్టి లాడ్జిలో నాలుగు రోజులు గడిపాను.

వీర్రాజు పాటించే క్రమశిక్షణ నాకు బాగా ఉపయోగపడుతోంది. సెలవురోజులు మినహాయిస్తే అతను మిగతారోజుల్లో పదినుంచి అయిదు మధ్యలో యింటికి రాడు. అందుక్కారణం ఏమైనా కావచ్చు. నాకు తెలుసుకోవాలని లేదు.

అయిదవరోజున లాడ్జిలో నేను పరవశం పట్టలేక రాజశేఖరంతో ఏమిటో వాగుతున్న సందర్భంలో— "ఎక్స్‌క్యూజ్ మీ!" అన్నమాటవినిపించి వులిక్కిపడ్డాను.

రాజశేఖరం చటుక్కున దుప్పటీ మీదకు లాగి అటు తిరి గాడు.

అతనికి మప్పయ్యేళ్ళలోపే వుంటుంది వయసు. మనిషి ఎర్రగా బాగున్నాడు.

"ఎలా వచ్చావిక్కడికి?" అన్నాడు రాజశేఖరం.

"తలుపులు వేసి వున్నప్పటికీ ఏ సమయంలోనయినా నేను ఏ గదిలోకయినా వెళ్ళగలను. అందుకు కొన్ని ఏర్పాట్లున్నాయి" అన్నాడతను.

"కావచ్చు. అది కస్టమర్సుకి ఇబ్బందికాదా?"

"కస్టమర్సుకి సౌకర్యం కలిగించడం కోసమే మేమీ ఏర్పాటు చేశాం. మిమ్మల్ని కలుసుకునేందుకు విశ్వనాథం వచ్చాడు. అతన్ని పంపి గదితలుపు తట్టమనడం కంటె నేనిలా రావడం మంచిదనిపించింది" అన్నాడతను.

"ఓకే మిస్టర్ గంగాధర్!" అన్నాడు రాజశేఖరం. అతని ముఖంలో కంగారు స్పష్టంగా కనబడుతుంది.

"గంగాధర్ ఎవరు రాజూ?" అన్నాను.

"వచ్చేక చెబుతాను" అంటూ అతనులేచి గబగబా బట్టలు వేసుకుని హడావుడిగా అక్కణ్నుంచి వెళ్ళి పోయాడు. నేనేం చేయాలో తెలియక అలా దుప్పటి లోనే వుండిపోయాను.

"నన్ను చూసి నీవు సిగ్గుపడనవసరం లేదు మోహనా. నేనూ నీకు కావలసినవాణ్నే!" అన్నాడు ఆ యువకుడు.

"ఎవర్నువ్వు?" అన్నాను కంగారుగా.

"నా పేరు రాజకుమార్. ఈ హోటల్ ప్రొప్రయిటరు కొడుకుని. ఇప్పుడు బయటకు వెళ్ళిన రాజశేఖరం తిరిగి రావటానికి కనీసం రెండుగంటలు పడుతుందని తెలిసినవాణ్ని" అన్నాడు.

"నేను రాజశేఖరం కోసం వంటరిగా ఎదురుచూడగలను. నువ్విక్కణ్ణించి వెళ్ళిపోతే చాలాసంతోషిస్తాను" అన్నాను. నాకు అసహనంగా వుంది.

"నేను వెళ్ళడానికి రాలేదు. నీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు రాజకుమార్.

"నువ్వు కనీసం కాసేపయినా బయటకు వెడితే నేను బట్టలు వేసుకుంటాను."

రాజకుమార్ నవ్వి "మాట్లాడటానికి బట్టల అవసరం దేనికి? ఇంత సేపూ మాటాడలేదూ! ఆడవాళ్ళతో ఇలా మాటాడడంలోనే థ్రిల్ కూడా వుంటుంది" అన్నాడు.

"నువ్వు మాటాడదల్చుకున్నది చెప్పు" అన్నాను.

వీర్రాజు పక్కన వీధిన నడుస్తున్నప్పుడు ఎవరయినా నా అందం చూసి కన్ను చెదరినా రెండోసారి చూడ్డానికి భయపడేవారు. నా అందం అద్భుతమైనదే కావచ్చు—కానీ దానికింత కాలమూ లభించే గౌరవం చేజేతులా పోగొట్టుకున్నాననిపిస్తోంది. రాజశేఖరం వెర్రిలోపడి నానాటికీ పతనమై పోతున్నాను. దీనికి అంత మెక్కడ?

"మా లాడ్జికి చాలామంది ఆడవాళ్ళు వచ్చారు కానీ నీలాంటి వాళ్ళు చాలా అరుదు. నీది అద్భుతసౌందర్యము. సౌందర్యానికిదగ్గ రసికతకూడా నీదగ్గర వుంది" అన్నాడు రాజకుమార్.

"ఇవన్నీ ఎందుకు చెబుతున్నావ్?"

"మా లాడ్జి సామాన్యమయినదికాదు. ఆనందంకోసం ఇక్కడికి వచ్చేవాళ్ళంతా మినిస్టర్ లెవల్ వాళ్ళు. ఒక రాత్రికి ఒకోసారి లక్షరూపాయలుకూడా సంపాదించుకోవచ్చు. డబ్బుసంగతి అటుంచితే కొన్నికొన్ని అవసరాలకు ఆడవాళ్ళు పనికివచ్చినట్లుగా ఎవ్వరూ పనికిరారు.

నీలాంటి వాళ్ళను ఎరచూపి కొండమీద కోతినికూడా దింపవచ్చు" అన్నాడు రాజకుమార్.

"నేను వ్యభిచారిణిని కాను..." అన్నాను నీరసంగా.

"అలాగని ఎవరన్నారు? అయినా శోభాలాడ్జిలో జరిగేది వ్యభిచారమెలాగౌతుంది? అదేమీకాదు. నీకు వేరే భర్తవున్నాడు. అయినా రాజశేఖరంతో కలుసుకుంటున్నావ్. అలాగే మరోవ్యక్తితో గడపాలి. అందుకు నీకు మంచి ప్రతిఫలముంటుంది!"

"నాకు డబ్బాశలేదు. నాగురించి మీరూహించినది తప్పు. నన్ను వదిలిపెట్టు."

"మాలాడ్జిలో గడిపిన ప్రతి ఆడదీ మేము చెప్పినట్లు విని తీరాల్సిందే!"

"వినకపోతే..."

"వినకపోతేనా?" అని నవ్వాడు రాజకుమార్. "నీ జీవితం బజారు పాలవుతుంది. ఇక్కణ్నించి బయటపడకుండా పచ్చిబోగందానిగా నిన్ను మార్చేస్తాను. నా మాటవింటే భర్త నీడన బ్రతుకుతూ నాకూ సాయపడవచ్చు..."

నాకు చాలా భయంవేసింది. ఏదో భయంకర వ్యూహంలో నేను ఇరుక్కుపోతున్నానేమోనని నాకు అనుమానం కలిగింది. ఇందులో రాజశేఖరం పాత్రకూడా వున్నదా?

"ఆలోచిస్తావు. నాకు తెలుసు. కానీ అతి తెలివికి పోకు. ఇక్కణ్నించి మంచిమాటలతో బయటపడి ఆ తర్వాత మోసంచేయాలనుకుంటే జరగదు. మాలాడ్జిలో నువ్వు రాజశేఖరంతో పొందిన ప్రతి అనుభవమూ మూవీ కెమేరాలో కెక్కింది. ఆ ఫిల్ము బయటకు రావడం నీకిష్టముంటుందనుకోను..."

నా గుండెలు అవిసిపోయాయి. అతని మాటలు నేను నమ్మలేదు. అప్పటికప్పుడు రాజకుమార్ గదిలో ఫిల్ము ప్రదర్శించి చూపేక నామీద నాకే అసహ్యం వేసింది. ఎటువంటిదానికి ఎటువంటి గతిపట్టింది?

"ఇది ఇంకెవరయినా చూశారా?"

"నిన్ననే ఒకమినిస్టర్ గారికి మా లాడ్జికి సంబంధించిన కొన్ని ఫిల్ముల్ని చూపించాం. ఆయన నీమీద మోజు పడ్డారు. ఎల్లుండిరాత్రి పదిగంటలకి ముహూర్తం పెట్టేరు. ఆయనతో మాకో ముఖ్యమయిన పనివుంది. ఈ దెబ్బతో మాపనికూడా జరిగిపోతుంది. నీకు పదివేల రూపాయలు బహుమానంకూడా వుంటుంది" అన్నాడు రాజకుమార్.

"నాకు వివాహమయిందనీ, భర్త వున్నాడనీ తెలుసు గదా మీకు..."

"అదేగా నీ అభ్యంతరం!" అని రాజకుమార్ నవ్వేడు. ఆ నవ్వు చూస్తూంటే వెంటనే ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. అతని దృష్టిలో నా స్థానం యేమిటో ఆ నవ్వు చెబుతుంది. "నీ భర్తకు నిద్రమందుపెట్టి మేము పంపించిన కారులో ఎక్కి ఇక్కడకువచ్చి పని పూర్తిచేసుకుని పదివేలరూపాయలతో తిరిగి వెళ్ళు."

"చెప్పవలసింది చెప్పావుగా. ఇంక వెళ్ళు" అన్నాను కసిగా.

"వెడతాను. కానీ అప్పుడేకాదు..." అన్నాడు రాజకుమార్. అతన్ని నేను వారించగల నైతిక శక్తిని ఎప్పుడో కోల్పోయాను.

రాజశేఖరం తిరిగి వచ్చేదాకా రాజకుమార్ అక్కడే వున్నాడు. నాకు నా శరీరం అంటే అసహ్యం వేస్తోంది. రాజశేఖరం రాజకుమార్ ని చూసి, "యిందాకట్నుంచీ ఇక్కడేవున్నావా?" అన్నాడు.

"లేదు. మళ్ళీ ఇప్పుడే వచ్చాను. గంగాధర్‌ని కల్సు కున్నావా?" అన్నాడు.

"ఊఁ" అన్నాడు రాజశేఖరం అదోలా. అతని ముఖంలో దిగులు కనిపించింది. రాజకుమార్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"రాజా — నువ్వు నన్నేం చేయదల్చుకున్నావో తెలియడం లేదు" అన్నాను.

"ఏమయింది?" అన్నాడు రాజశేఖరం. అతను చాలా నిరుత్సాహంగా వున్నాడు.

"ఈ రాజకుమార్ — ఈ గదిలో మనం పొందిన అనుభవాలన్నింటినీ సినిమాగా తీశాడు" అన్నాను.

రాజశేఖరం ఆశ్చర్యపోయాడు. అతనికి వివరంగా వాడు చెప్పిన మాటలు చెప్పాను. వాడు నన్ను లోబర్చుకున్న విషయం మాత్రం చెప్పలేదు.

రాజశేఖర్ పిడికిళ్ళు బిగిశాయి. "ఆ స్కౌండ్రల్ని చంపేస్తాను..." అన్నాడు.

"వెంటనే ఆపని చేయి. దేశానికి మేలు జరుగుతుంది" అన్నాను.

రాజశేఖరం ముఖం గంభీరంగా అయిపోయింది. "కానీ వాడిదగ్గర ఫిల్ము వుండిపోయింది. ఇలా యెంతమందికి సంబంధించినవి వున్నాయో వాడిదగ్గర. ఆ విశేషాలన్నీ బయట పెట్టకుండా..." అంటూ ఆగాడు.

"నువ్వు రాజకుమార్‌ని చంపవు. చంపలేవు. నాకు తెలుసు" అన్నాను.

"ఏం?" అన్నాడు రాజశేఖరం.

"ఇదంతా నువ్వాడుతున్న నాటకం. తెలివి తక్కువగా ఇందులో నేనిరుక్కుపోయాను. ఇందులో నీపాత్ర లేదని ఇంకా నన్ను నమ్మించాలని చూడకు" అన్నాను.

రాజశేఖరం ఆట్టే తడబడలేదు— "పరిస్థితులలా వచ్చాయి. నువ్వలాగనుకోవడంలో తప్పులేదు. కానీ నా పవిత్ర ప్రేమను నువ్వర్థంచేసుకునే రోజు రాకపోదు"

"ఎప్పుడు? నేను ఆత్మహత్య చేసుకున్నాకనా?" అన్నాను.

"ప్లీజ్ మోహనా! ఆత్మహత్య గురించి ఆలోచించకు. త్వరలోనే మనమిద్దరం వివాహం చేసుకుందా"మన్నాడు రాజశేఖరం.

"గంగాధర్ ఎవరు?" అన్నాను.

"అవన్నీ నీకు తర్వాత చెబుతాను" అన్నాడు రాజశేఖరం.

"నాకు తెలుసు. గంగాధర్ అన్నది నీవు సృష్టించిన పాత్ర. గదిలో నన్నీ పరిస్థితిలో కాసేపు రాజకుమార్ కు ఒప్పగించి వెళ్ళడంకోసం ఈ నాటకం ఆడారు..." అన్నాను.

"నువ్వేమనుకున్నా సరే. రేపు మళ్ళీ లాడ్జికిరావడం మానవద్దు. నువ్వులేకపోతే నేనుండలేను" అన్నాడు రాజశేఖరం దీనంగా నావంక చూస్తూ. ఆ చూపులకు నేను కరిగిపోలేదు. అతనివంక అసహ్యంగా చూస్తూ— "నేనెంత తెలివితక్కువదాన్ని! ఎంతో అసహ్యకరమైన అనుబంధానికి ప్రేమ అని నువ్వు పేరుపెడితే నమ్మి నువ్వు చెప్పినట్లల్లా ఆడాను. ఇంక అలా జరగదు. రేపు నా గుమ్మం తొక్కావో ఉరేసుకు చస్తాను" అన్నాను.

అక్కడింక ఒక్క క్షణంకూడ వుండబుద్ధి వేయలేదు. తక్షణం బయటపడ్డాను.

## 9

మర్నాడు లాడ్జికి నేను వెళ్ళలేదు. రాజశేఖరం నా ఇంటికీ రాలేదు. ఆరోజు మధ్యాహ్నం నాకు హాయిగా

నిద్రపట్టేసింది. ఆ మర్నాడు మధ్యాహ్నంకూడా నేను మంచి నిద్రలోవున్న సమయంలో ఎవరో యింటి తలుపు తట్టారు.

వెళ్ళి తీశాను. పరిచయంలేని ఆడపిల్ల!

లోపలకు రమ్మన్నాను. ఆమె తలుపులు వేసి "రాత్రి పనికోసం స్లీపింగ్ టాబ్లెట్సు తీసుకువచ్చాను. ఇవి స్పెషల్ వెరైటీ. ఒక్క టాబ్లెట్ వేసుకుని పడుకుంటే ఎనిమిదిగంటలసేపు మహా ప్రళయంవచ్చినా లేవకుండా నిద్రపోతారు" అంది.

ఆమె కంఠం అదోలావుంది. నేనామె వంక ఆశ్చర్యంగా చూసేలోగా—"కంగారుపడకు. నేను నీకేమీ అపకారం చేయను" అందామె. ఆమె ఆడపిల్ల కాదనీ మగవాడనీ అప్పుడే నాకు తెలిసిపోయింది. అతను రాజకుమార్.

"నిజానికి ఈ వేషం వేయాల్సిన అవసరం నాకులేదు. నీపట్ల ఆకర్షణ చాలా బలంగా వుంది నాకు. నలుగురి అనుమానానికీ గురయ్యే పరిస్థితుల్లో నిన్నుంచడం ఇష్టంలేక ఈ వేషంలో వచ్చాను" అన్నాడు రాజకుమార్.

అతన్ని ఏమనాలో తెలియకపోయినా వారించే శక్తి లేక వూరుకున్నాను. అతను వెళ్ళిపోయాక నా జీవితం గురించి మళ్ళీ కాసేపు ఆలోచించుకున్నాను. ఎందుకో నాకు ఏడుపు వచ్చింది.

రాత్రి తొమ్మిదిన్నరకు టాబ్లెట్ ప్రభావంతో ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న వీర్రాజును చూస్తుంటే నాకు మొదటిసారిగా జాలి కలిగింది. అతని ఉద్యోగ జీవితం యెటువంటిదో నాకు తెలియదు కానీ నిజ జీవితంలో మాత్రం అంతులేని క్రమశిక్షణ పాటిస్తాడు.

పాటించమని నన్ను వేధిస్తాడు. అతని మాటలు అక్షరాలా పాటించివుంటే నాకీగతి పట్టివుండేది కాదేమో!

రాత్రి పదిగంటలకు ఇంటిముందు కారాగింది. ఇంటికి తాళంపెట్టి అందులో వెళ్ళాను నేను.

సాధారణంగా ఆ సమయానికి వీధి నిర్మానుష్యంగా వుంటుంది. నన్నెవ్వరూ గమనించి వుంటారనుకోను. ఒక వేళ ఎవరయినా గమనించినా ఆయనకు చెప్పే అవకాశం లేదు. వీధిలో ఎవ్వరితోటీ ఆయనకు పరిచయంలేదు. క్రమశిక్షణ పేరుతో ముభావంగా వుండడంవల్ల ఆయన అంటే చాలామందికి కిట్టదుకూడా.

ఆ మినిస్టరన్నవాడు చాలా అసహ్యంగా వున్నాడు నలభై అయిదేళ్ళుంటాయేమో! మనిషి లావుగావున్నాడు' పెద్ద బొజ్జ. చూపుల్లో కళ్ళు! గారపట్టిన పళ్ళు!

అంతవరకూ నన్ను నేను అసహ్యించుకున్నానేమో గానీ ఆరాత్రి నేను వ్యభిచారిణినన్న భావం నాలో కలిగింది. వాడు రాజశేఖరంతో నేను పొందిన అనుభవాల సినిమా చూస్తూ తన్ను రాజశేఖరంకంటె ఉన్నతుడిగా భావిస్తూ నాతో మాట్లాడుతూ నన్ను శారీరకంగా మానసికంగా చిత్రహింస చేశాడు. వాడు దగ్గరున్నంత సేపూ నరకంలో వున్నట్టే వుందికానీ అసహ్యించుకునే స్వతంత్రత లేక రాజకుమార్ చేసిన హెచ్చరికలను దృష్టిలో వుంచుకొని ఎంతో ఆనందాన్ని నటిస్తూ రసికతను ప్రదర్శించాను.

అక్కణ్నించి బయటపడే ముందు నాకు వందరూపాయల నోట్లు అందాయి. మళ్ళీ కారెక్కాను.

ఇదేనా నేను కోరుకున్న స్వేచ్ఛ! క్రమశిక్షణ గురించి పట్టుపట్టే భర్త బాధ భరించలేక నేను రాజశేఖరాన్ని

ఆశ్రయిస్తే నాకు లభించినదేమిటి? నా కిష్టంలేని మనిషికి నేనసహ్యించుకునే మనిషికి నన్ను నేను అర్పించుకోవలసి వచ్చింది.

కారును సందుమొగలో ఆపివేయమని చెప్పాను. అక్కణ్నించి దిగి తిన్నగా ఇంటికివెళ్ళి తలుపుతీస్తూంటే. భుజంమీద ఎవరిదో చేయిపడింది. ఉలిక్కిపడి అటు తిరిగాను.

అతను గోవిందరావు! మా వీధిలోని బ్రహ్మచారి!

"ఎంత ధైర్యం?" అనుకున్నాను కానీ అనలేదు. ఆ ధైర్యానికేదో కారణముంటుందని వూహించగలను. ఐతే నాగురించి ఇతనికూడా తెలిసిపోయిందా?

"మీ ఇంటికి కారు రావడం చూశాను. మీరొక్కరే అదెక్కడం చూశాను. నా స్కూటర్ మీద కారుని అనుసరించాను కుతూహలంతో. కారు శోభా లాడ్జికి వెళ్ళింది. మీరు లాడ్జికి వెడతారని నాకు తెలియదు. లేడిపోతే ఎప్పుడో ప్రయత్నించేవాణ్ని. అక్కడే పక గాపులు పడి కూర్చున్నాను మీరు బయటకు వచ్చేదాకా! మీ సంగతి నాకు తెలిసిపోయింది. నన్ను మీరు కాదన కూడదు..." అన్నాడు గోవిందరావు.

భోరుమని ఏడవాలనిపించింది. ఎంచేతో కళ్ళలోకి నీళ్లు రాలేదు.

అతనికి ఏదోవిధంగా నచ్చజెప్పి, మర్నాడు అతని కోరిక తప్పక తీరుస్తానని చెప్పిపంపేశాను.

# 10

వీర్రాజు ఆఫీసుకు వెళ్ళిపోయేక ఓ అరగంటసేపు తీరుబడిగా ఆలోచించాను.

నేనిప్పుడు గౌరవముందుకోగల ఆడదాన్ని కాదు.

బజారుమనిషిని. రోజురోజుకూ నన్ను లొంగదీసుకునే మగవాళ్ళ సంఖ్య పెరుగుతోంది. ఈ బ్రతుకు నాకు దుర్భరంగా వుంది. ఇలా జీవించాలని నేనెప్పుడూ అనుకోలేదు. నా కొక్కటే మార్గం కనబడుతోంది! అదే నా ప్రాణాలు నేను తీసుకోవడం!

గదిలో టేబుల్ వేశాను. టేబుల్ మీద స్టూల్ పెట్టాను. స్టూల్ మీద ఎక్కి తాడు ఒకటి గది కప్పుకున్న కొక్కానికి కట్టాను. చివర వదులుగా ముడివేశాను. ఆ బల్లమీద నిలబడి ముడి మెడకు తగిలించుకుంటున్నాను.

సరిగ్గా అప్పుడే తలుపులు తట్టారెవరో!

ఏం చేయాలి?... వెళ్ళి తలుపులు తీయాలా, లేక నా పని నేను చేసుకుపోవాలా!

వీధి తలుపులు ఎంతకూ తీయకపోతే ఆ మనిషి వెనక్కు వెళ్ళిపోవచ్చు. లేదా అల్లరిచేసి నలుగుర్ని పిలవ్వచ్చు. అప్పుడు నా ప్రాణాలు రక్షించబడే అవకాశముంది.

వచ్చిందెవరో చూసి వెంటనే పంపించేస్తే నా పని తర్వాత నిర్విఘ్నంగా అయిపోతుంది.

ఒకవేళ ఆ వచ్చినది జయదేవో, రాజకుమారో, గోవిందరావో అయితే!

ఎవరైనా సరే లోపలకు రానివ్వను. అల్లరిచేసైనా వాళ్ళను బయటికి తోసేస్తాను. వాళ్ళవల్ల ప్రమాదానికి భయపడ్డానికి ప్రాణాలింకా వుంటేగద!

తాడును వదిలిపెట్టి బల్లమీంచి టేబుల్ మీదకూ, టేబుల్ మీంచి నేలమీదకూ దిగి గదిలోంచి బయట పడ్డాను. తలుపులు దగ్గరగా వేసి వీధి తలుపులు తీశాను.

బయటనున్న మనిషి నేననుకున్న దెవ్వరూ కాదు. వీర్రాజు!

"మీరా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. నేనే—ఆశ్చర్యంగా వుందా?" అన్నాడు వీర్రాజు. అతడి కళ్ళు చుట్టూ దేనికోసమో వెదుకుతున్నాయి.

"ఏం కావాలి మీకు? ఎన్నడూ లేనిది ఇలా వచ్చారేమిటి?" అన్నాను.

"నాకు పని వుంది..." అంటూ అతను పడకగదిలోకి నడుస్తున్నాడు. అతనా గదిలోకి వెళ్ళడం నా కిష్టంలేదు. అడ్డంగా నిలబడి—"ఏంకావాలో చెప్పండి!" అన్నాను.

అతను విసురుగా నన్ను పక్కకు తోసేసి—"నీకిచ్చిన స్వేచ్ఛను ఎంత చక్కగా వినియోగించుకుంటున్నావో చూస్తాను..." అంటూ ముందుకువెళ్ళి రెండు తలుపులూ తోసి అక్కడ కనబడ్డ దృశ్యంచూసి ప్రాణ్నపడిపోయాడు.

అత నేదో అడిగేలోగా నేను రెండుచేతులతో ముఖం కప్పుకుని ఏడవసాగాను. అప్పుడు నా కళ్ళలోకి ఆగకుండా నీళ్ళు వస్తున్నాయి. అంత ఏడుపును ఒక్కసారిగా బయటపెట్టలేక మధ్య మధ్య వెక్కుతున్నాను.

"మోహనా! ఎందుకు తలపెట్టావీ దారుణానికి!" అన్నాడు వీర్రాజు. అతని కంఠం ఇదివరకటిలా లేదు. చాలా సౌమ్యంగా లాలనగా వుంది. ఆ కంఠంలోని ధ్వనికి నా ఏడుపు పెరిగిపోయింది.

వీర్రాజు నన్ను సమీపించాడు. అప్రయత్నంగా నా తల అతని గుండెలమీద వాలిపోయింది. అతను ప్రేమగా నా ముంగురులు, చెక్కిళ్ళు నిమురుతూ—"చెప్పు—ఈ దారుణానికి ఎందుకు తలపెట్టావు?" అన్నాడు.

"నాకు జీవించడానికి అర్హత లేదు!" అన్నాను ఇంకా ఏడుస్తూనే.

"అసలేం జరిగింది?"

"నా నోటితో చెప్పలేను..."

"నువ్వు చెప్పక్కర్లేదు. అంతా రాజశేఖరం చెప్పాడు" అన్నాడు వీర్రాజు.

"ఎప్పుడు?" అన్నాను అప్రయత్నంగా.

"నిన్న మధ్యాహ్నం" అన్నాడు వీర్రాజు.

వీర్రాజు చెప్పిన కథ వింటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

వీర్రాజుపై రాజశేఖరానికి రెండువిధాల పగ వుంది. నన్ను వీర్రాజు పెళ్ళిచేసుకోవడం మొదటిది. రాజశేఖరం భార్య నాగదేవి వీర్రాజు పాత ప్రియురాలు కావడం రెండవది. పెళ్ళి సమయానికి ఈ కథ రాజశేఖరానికి తెలియదు. పెళ్ళయ్యేక తన భార్య అప్పుడప్పుడు వీర్రాజును కలుసుకుంటున్నట్లు అతను గ్రహించాడు. వాళ్ళిద్దర్నీ ఓ పర్యాయం రెడ్ హేండెడ్ గా పట్టుకున్నాడు రాజశేఖరం.

నాగదేవి బరితెగించిన ఆడది. నేను వీర్రాజును ప్రేమించాను, మీ కిష్టం లేకపోతే విడాకులివ్వండి అనేసిందిట. రాజశేఖరం వంశప్రతిష్ఠకు అది చాలా అవమానం.

వీర్రాజును రాజశేఖరం ఎన్నోమార్లు రిక్వెస్టు చేశాడు. కానీ కోరివచ్చినఆడదాన్ని వదులుకోలేనన్నాడు వీర్రాజు. దానిమీద రాజశేఖరం వీర్రాజుపై పగబట్టాడు. నిన్ననే అతను వీర్రాజుకు తెలియజేశాడు—"నీ భార్యను నేను వచ్చి వ్యభిచారిణిని చేశానని" అందుకు ఋజువుగా అతను చాలా ఫోటోలు చూపించాడు.

అమాయకంగా కనబడే తన భార్య ఇలా ప్రవర్తించిందని వీర్రాజు నమ్మలేదు. ఈ రోజు అందుకే ఇంటికి వచ్చి చూశాడు.

“నీ తరఫున నీ కథకూడా చెప్పు. అంతా నిజమే చెప్పు. అసలేం జరిగింది?”

నాకు నిజం దాచాలనిపించలేదు. అంతవరకూ జరిగిందంతా వివరంగా వీర్రాజుకు చెప్పేశాను. ఆఖరుకు గోవిందరావు సంగతికూడా వదలలేదు. అన్నీ వింటున్నప్పుడు వీర్రాజు ముఖం బాగా ఎర్రబడిపోయింది. ఆవేశాన్ని అతి కష్టంమీద అణచుకుంటున్నాడని గ్రహించాను.

అంతా అయిపోయేక “చూడు మోహనా! నేనోసారి బయటకు వెళ్ళిరావాలి. అంతవరకూ ఏ అఘాయిత్యమూ తలపెట్టకు. నీ సమస్యకు మంచి పరిష్కారాన్ని నేను సూచిస్తాను” అంటూ అతను గదిలో ఉరితాడు తీసేసి— “నా మాట విని నేను వచ్చేదాకా ఎదురుచూస్తావని ఆశిస్తున్నాను” అంటూ ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

ఆ క్షణంలో నాకు ఆత్మహత్యా ప్రయత్నాన్ని కొనసాగించే మనోధైర్యం లేదు. వరండాలో సోఫాలో చతికిలబడిపోయాను.

వీర్రాజు వెళ్ళిన అర్ధగంటకు రాజశేఖరం ఇంట్లోకి వచ్చాడు. వరండాలో కూర్చున్న నన్నుచూస్తూ—“మన సమస్యకు మంచి పరిష్కారం సూచించడానికే వచ్చాను” అన్నాడు.

“సమస్యను సృష్టించిన వాడివి నువ్వు. నీ స్వార్ధం కోసం ఓ ఆడదాని నిండు జీవితాన్ని బలిచేశావు. నిండు హృదయంతో నీమీద ప్రేమను ప్రకటిస్తే—దాన్ని నిలువునా దగ్ధంచేశావు. నీఅంత దుర్మార్గుడు వేరే ఎక్కడా వుండడు” అన్నాను కోపంగా.

రాజశేఖరం నా ఎదురుగా కుర్చీలో కూర్చుని—

"వీర్రాజులాంటి వాడికి నేను చేసినకాస్తి తప్పంటావా?" అన్నాడు.

"నువ్వు నీ గురించీ వీర్రాజుగురించే ఆలోచిస్తున్నావు కానీ ఈ పగలమధ్య ఒక ఆడదాని నిండుబ్రతుకు..." అని నేనేదో అనబోతూంటే—

"అలా ఎందుకు జరగనిస్తాను? నిన్ను నా దాన్ని చేసుకుంటాను" అన్నాడు రాజశేఖరం.

"ఇది సంభవమా?" అన్నట్లు ఆశ్చర్యంగా చూశాను.

నా చూపులు అర్థం చేసుకున్నట్లున్నాడు రాజశేఖరం "అది చెప్పడానికే వచ్చాను. నిన్ను నేను వివాహం చేసుకుంటాను. అయితే మనం కొత్తచోట కాపురం ప్రారంభిస్తాం. నీకు తెలియకుండా ఇక్కడ కొంతకాలం నాకు వ్యాపారంలో సహకరించావు. అదేవిధంగా తెలిసీ కూడా ఇకముందు వ్యాపారంలో నాకు సహకరించాలి. నీకు ఏ లోటూ వుండదు. ఒక ప్రముఖుడి పర్సనల్ సెక్రటరీగా నీకు సమాజంలో పలుకుబడి వుంటుంది. ఖరీదైన జీవితం వుంటుంది."

"అంటే నీకు ఉంపుడుకత్తెగా వుంటూ, నువ్వడిగిన వారికి సుఖాన్నిస్తూ — ఓ వ్యభిచారిణి జీవితం గడపమంటావు" అన్నాను కసిగా.

"అలాగేంకాదు...నువ్వేం చేసినా అభ్యంతరం పెట్టని ఓ భర్తకూడా వుంటాడు."

"వుంటాడు. ఆ భర్తమాత్రం నువ్వుకాదు. అవునా?" అన్నాను.

"అవును మోహనా! వీర్రాజు నిన్నెలాగూ ఇక్కడుండనివ్వడు. నువ్వు నిరాశ్రయురాలివై పోకుండా ఆకర్ష

ణీయమైన జీవిత మొకటి నా దగ్గరుందని చెప్పడంకోసమని వచ్చాను. ఆలోచించుకుని నీకు నచ్చుబాటయితే వెంటనే శోభా లాడ్జికి వచ్చి రాజకుమార్ ని కలుసుకో. అతను నిన్ను నా దగ్గరకు చేరుస్తాడు” అని వెళ్ళిపోయాడు రాజశేఖరం.

“చాలా గొప్ప ఆఫర్!” అనుకున్నాను మనసులో కసిగా.

రాజశేఖరం వ్యాపారస్థుడి కొడుకు. అతడికి చాలా లోపాయికారీ వ్యవహారాలుంటాయి. వాటికి నన్నుపయోగించుకోవాలనుకుంటున్నాడు. నైతికంగా పతనమైన నన్ను వీర్రాజు గెంటేస్తే నాకు నీడలేకుండా పోతే— తను ఆశ్రయమిచ్చి నా బలహీనతల నాధారంగా చేసుకుని తన వ్యాపారం పనులు చేయించుకోవాలనుకుంటున్నాడు.

ఆ జీవితం తలచుకుంటేనే భయంకరంగా వుంది. ముందు ఏదో పొరపాటు అభిప్రాయాలలో వున్నానుకానీ ఇప్పుడు తలచుకుంటూంటే వీర్రాజు క్రమశిక్షణ జీవితమే చాలా చాలా బాగుందనిపిస్తోంది.

సరిగ్గా ఇంకోగంటకు వీర్రాజు వచ్చాడు. “నువ్విచ్చిన సమాచారం చాలా వుపయోగపడింది మోహనా! రాజశేఖరం భావిస్తున్నట్లు మాది స్మగ్లింగ్ వ్యాపారం కాదు. అలా నటిస్తోన్న ప్రభుత్వోద్యోగులం మేము. మాకు నిర్దుష్టమయిన కొన్ని పథకాలున్నాయి. ఆప్రకారం దేశంలోని కొందరు వ్యాపారస్థుల్నీ, ప్రముఖుల్నీ నిర్ణయించిన పద్ధతిలో చెకింగ్ చేస్తాం. నీద్వారా ఆ సమాచారం రాజశేఖరం ముఠాకు లీక్ అయింది. పోలీస్ వాళ్లు ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తారో మాకు

ముందుగానే తెలుస్తోందని రాజశేఖరం అనుకున్నాడు తప్పితే మేము ప్రభుత్వోద్యోగులమని అనుకోలేకపోయేడు. నువ్వు చెప్పిన సమాచారం ఆధారంగా రాజశేఖరం, జయదేవ్, రాజకుమార్ వగయిరాలను అరెస్ట్ చేసే ఏర్పాట్లను చేసివచ్చాను. ఏర్పాట్లు చాలా పకడ్బందీగా జరుగుతున్నాయి. ఇందులో నా ప్రసక్తి ఏమీవుండదు..." అంటూ మెరుస్తున్న కళ్ళతో అతను చెబుతూంటే నేను ఆశ్చర్యంగా విన్నాను.

"మనమిక్కడ ఉండం. ఇంకో వూరు వెళ్ళిపోతాం" అన్నాడు వీర్రాజు.

"మనం అంటే!" అన్నాను ఆశ్చర్యంగా.

"మనం అంటే నువ్వూ నేనూ" అన్నాడు వీర్రాజు.

"అదెలా సాధ్యం? నేను... నేను..."

"ఆగు మోహనా!" అన్నాడు వీర్రాజు. "తప్పు చాలావరకు నాదే! ఒక విధమయిన కండకావరంతో రాజశేఖరం భార్యను నేను వదలుకోలేక పోయాను. అందుకేగదా అతను నామీద పగబట్టాడు. ఆ విధంగా చూస్తే అతని పగకు కారణం నేనుచేసిన తప్పు! ఆ పగను అతను నీమీదకు మళ్ళించాడు. అదికూడా నా కారణంగానే! ఎటొచ్చీ అతను వ్యాపారస్థుడు కాబట్టి,నీద్వారా తన పగను తీర్చుకుంటూ తన పనులుకూడా చాలావరకూ చేసుకున్నాడు. చివర్లో నాముందు నిర్భయంగా నువ్వు చెప్పిన నిజాలు అతన్ని పట్టిచ్చాయి."

"ఏది ఏమయినా నేను చాలాతప్పులు చేశాను. అందులో నా బాధ్యత లేదని నేననలేదు. తెలిసి చేసిన తప్పులవి" అన్నాను.

"నువ్వు తెలిసికూడా తప్పుచేసే మనస్థితి నీపట్ల నా

ప్రవర్తన కారణంగా నీకు ఏర్పడింది. ఈరోజు ఉదయం నేను విపరీతమైన కోపంతో ఇంటికొచ్చాను. కానీ అక్కడ నీ ఆత్మహత్యా ప్రయత్నం చూసినాక నే మానసికంగా నువ్వెంత క్షోభకు గురవుతున్నావో తెలుసుకో గలిగాను. అప్పుడే నాబుద్ధి పనిచేసింది. నా తప్పులన్నీ తెలిశాయి. నా వివేకం నాకు కర్తవ్యబోధ చేసింది. ఫలితంగా నిన్ను సంతోష పెట్టాలనుకున్నాను.ఇకమీదట మనం గడపబోయే జీవితం కొత్తగా వుంటుంది..." అన్నాడు వీర్రాజు ఉత్సాహంగా.

"కానీ నేను మానసికంగా మామూలు జీవితానికి సిద్ధపడిలేను" అన్నాను నీరసంగా.

"బురదలో పడ్డ పువ్వును కడిగివేస్తే బురదపోయి స్వచ్ఛంగా మెరుస్తుంది. ఆ సంగతి తెలిసిన నేను పువ్వును మళ్ళీ బురదలో పారవేయలేను. ఇది నా నిర్ణయం! నా నిర్ణయం బలవంతంగా నీమీద రుద్దడం యిది ఆఖరుసారి అవుతుంది." అన్నాడు వీర్రాజు.

తప్పుచేయని వాడికంటె తప్పును క్షమించినవాడే గొప్పవాడు. అటువంటి గొప్పతనం ఇదివరలో వున్నాలేకపోయినా ఇప్పుడు వీర్రాజులో వున్నందుకు అతనిపై అంతులేని గౌరవాభిమానాలు కలిగాయి నాకు. ఆనందంతో దుఃఖం ముంచుకురాగా అతని హృదయంపై వాలి తనివితీరా ఏడ్చాను.

—: అయిపోయింది :—